


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల
శుక్రవారం 29 మార్చి 2024 | 12 పేజీలు


# కళ్యాణ వైభోగమే....!





## - ఆది దంపతుల కళ్యాణం ఆధ్యాత్మికం
## - వేములవాడకు పోటెత్తిన భక్తులు



**సూర్య వేములవాడ**

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఘనంగా శివకళ్యాణ వేడుకలు నిర్వహించారు. గురువారం ఆలయంలోని ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారి కళ్యాణమండపంలో అభిజిత్‌లగ్న సుముహూర్తమున కన్నుల పండువగా ఆదిదంపతులు శివపార్వతుల కళ్యాణం అత్యంత వైభవంగా జరిపించారు. రాజన్న కళ్యాణం సందర్భంగా తెల్లవారుజామునుంచి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా (మిగతా 2లో)







### కాలం తెచ్చిన కరువు కాదు....
# కాంగ్రెస్ తెచ్చిన కరువు

## - మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్
## - ఎండిపోయిన పంటపొలాల పరిశీలన

**సూర్య తంగళ్లపల్లి**

కాలం తెచ్చిన కరువు కాదు....కాంగ్రెస్ తెచ్చిన కరువు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కెటిఆర్ అన్నారు. సారంపల్లి గ్రామంలో ఎండిన వరి పంట పొలాలను మాజీ మంత్రి కెటిఆర్ పరిశీలించారు. కౌలు రైతులతో పంట పొలాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. (మిగతా 2లో)



# భానుడి భగభగ

## - దంచి కొడుతున్న ఎండలు
## - జనాలు లేక బోసిపోయిన రోడ్లు



**సూర్య వేములవాడ టౌన్**

భానుడి దెబ్బకు జనాలు ఇంట్లో నుండి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. వారం రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో జనాలు ఇంట్లో నుంచి రావడం లేదు. రోడ్లన్నీ బోసిపోతున్నాయి. జనాలు రాకపోవడంతో చిరు వ్యాపారుల గిరాకీ దెబ్బతినడంతో చిరు వ్యాపారులు వాపోతున్నారు. అనూహ్యంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో మెల్లమెల్లగా నీటిమట్టం తగ్గుతుండడంతో ప్రజలు ఆందోళన నెలకొంది. ఎండకు ఉక్కపోత తోడవడంతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎండ వేడిమికి ఏసీలు కూలర్లు వాడక తప్పడం లేదు. దీంతో కూలర్లు ఏసీలకు గిరాకీ పెరగడంతో ధరలు అమాంతం పెరిగాయి. దీంతో విద్యుత్ (మిగతా 2లో)



### బిజెపి మళ్లీ గెలిస్తే భారత రాజ్యాంగాన్ని
# రద్దు చేసి రిజర్వేషన్లు తీసేస్తే ప్రమాదం

**-బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్**

**సూర్య-గోదావరిఖని**




2లో

# కల్యాణ వైభోగమే..!

(మొదటి పేజీ తరువాయి)

అలంకరించి బాసింగాలతో ముస్తాబుచేశారు. పెళ్లితంతు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. ఆలయంలో ఉదయం తీర్థరాజ పూజ, శ్రీ స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పరివార దేవతార్చనలు, అభిషేకాలు, పారాయణాలు, అవాహిత దేవతార్చనలు, వృషభయాగము, ధ్వజారోహణము, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం ముందు భాగం నుంచి ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న శివపార్వతులు ఉత్సాహంగా, ఓం నమోశివాయః నామస్మరణలతో అక్షింతలు చల్లారు. శివకల్యాణం సందర్భంగా లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయంలో భక్తులకు లఘుదర్శనం కల్పించారు. కోడెమొక్కుల సమర్ప ణను నిలిపివేశారు. శివకల్యాణం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శివపార్వతులు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. చేతిలో త్రిశూలం పట్టుకుని కళ్యాణం జరుగుతున్నంతా సేపు శివనామ స్మరణలు చేశారు.

**-హిజ్రాల సందడి**

ధ్వజరోహణ, ఎదుర్కోళ్ల వద్ద కోలాహలం నెలకొంది. కట్నకానుకల కోసం బేరసారాలు ఆడుకోవడం ఆకట్టుకుంది. ఎదుర్కోళ్ల నుంచి కల్యాణవేదికకు స్వామివార్లను పల్లకిలపై తీసుకవచ్చారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు అంక్షింతలు చల్లారు. చేతిలో త్రిశూలం, గంట, జబ్బకు సంచి, ఓడిబియ్యం, తలంబ్రాలతో కల్యాణానికి హాజరైన శివపార్వతులు, హిజ్రాలు తలంబ్రాలు పోసుకుంటూ, జీలకర్ర బెల్లం పెట్టుకుంటూ ఆకట్టుకున్నారు. శివకల్యాణం సందర్భంగా శివపార్వతులు గంట మోగిస్తూ త్రిశూలం ఆడించడంతో సందడిగా మారింది. పలువురు భక్తులు శివుడి వేషాధారణలో కల్యాణానికి హాజరయ్యారు. కొందరు భక్తులకు పూనకాలు రావడంతో భక్తులు వారి వద్ద రంగం చెప్పించుకున్నారు.

# కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు మాజీ మంత్రి కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచిన రూ.2లక్షల రుణమాఫీ ముచ్చట ఇప్పటివరకు ప్రస్తావించలేదన్నారు. చేస్తానన్న రుణమాఫీ చేయలేదు కదా బ్యాంకుల ద్వారా నోటీసులు ఇప్పిస్తూ మెడపైన కత్తి పెట్టి రుణాలు కడతారా చస్తారా అన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు ఉందని ఎద్దేవా చేశారు. రైతు భరోసాను కేసీఆర్ రూ.10వేలు ఇస్తానంటే రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రూ.15వేలు ఇస్తానని చెప్పి..అది కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు.రైతుల కోసం రైతు బందు కోసమని కెసిఆర్ ప్రభుత్వం రూ.7వేల కోట్ల ఖజానా ఉంచిపోతే.. కాంట్రాక్టర్ల కోసం, కాంట్రాక్టర్ల ఖజానా నింపడం కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెరతీసిందన్నారు.ఎండిన పోయిన పది పదిహేను లక్షలు ఎకరాలను రాష్ట్రవ్యాప్తంగా మా ఎమ్మెల్యేలతో పరిశీలుస్తున్నామన్నారు. రైతులను చూస్తే నిజంగానే బాదేస్తుందన్నారు.మేడిగడ్డ వద్ద కుంగిపోను మూడు పిల్లర్ల వద్ద కాపర్ డామ్ కడితె అయిపోయేది. దాన్ని



రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.ఢిల్లీకి జాతరలు, యాత్రలు తప్పితే రాష్ట్రానికి రేవంత్ చేసిందేమీ లేదన్నారు.కౌలు రైతులు, రైతులకు చేస్తానన్న లబ్ది చేకూర్చాలని డిమాండ్ చేశారు.రైతులకు ఇస్తానన్న క్వింటాలుకు రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతులు ధైర్యంగా ఉండండి మేం ఉన్నాం.రైతులు ఆత్మహత్యలు లాంటి తీవ్రమైన చర్యలకు పాల్పడవద్దని రైతులను కోరారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాన రూ.25వేలు వెంటనే అందించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టేస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావ్, బిఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ పవర్లూమ్, జౌళి శాఖ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ,ఎంపీపీ.పడిగల మానస రాజు,మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గజాబీంకర్ రాజన్న,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు సింగిరెడ్డి రవీందర్ రెడ్డి,పూసపెల్లి సరస్వతి,పాక్స్ చైర్మన్ బండి దేవదాస్ గౌడ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# బిజెపి మళ్లీ గెలిస్తే భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి రిజర్వేషన్లు తీసేస్తే ప్రమాదం

**-ఇదే జరిగితే మళ్లీ చీకటి యుగంలోకి నెట్టి వేయబడతాం -బిజెపి ఓటమి భయంతోనే ప్రతిపక్ష నేతలపై ఈడీ దాడులు -బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్**

**సూర్య-గోదావరిఖని:**

బిజెపి పాలనలో భారత దేశం ఇప్పటికే ప్రమాదంలోకి నెట్టివేయబడిందని, మళ్లీ బిజెపి కేంద్రంలో అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి రిజర్వేషన్లను తొలగిస్తారని వాస్తవ విషయాన్ని ప్రజలు గమనించాలని బీఆర్ఎస్ పార్టీ నేత, ఆ పార్టీ నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, బాల్క సుమన్ తో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఆత్మగౌరవంతో బతికే అవకాశం ఇచ్చినటువంటి రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు బిజెపి కుట్రలు చేస్తుందని, మళ్లీ బడుగు బలహీన వర్గాలను చీకటి యుగంలోకి నెట్టెందుకు బిజెపికి కుట్రలు చేస్తుందంటూ ఆరోపించారు. కొత్త రాజ్యాంగం అంటూ బిజెపి వారు మాట్లాడుతున్న తీరు చూస్తుంటే అందులో ప్రజల ప్రాథమిక హక్కులు పూర్తిగా తీసివేసి, మతపరమైన స్వేచ్ఛ లేకుండా చేసి, జీవించే హక్కు ప్రమాదంలో పడవేసి, స్వేచ్ఛగా తిరిగే హక్కు, మాట్లాడే హక్కు కూడా కాలరాసేందుకు కాషాయం పార్టీ చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ప్రవీణ్ కుమార్ సూచించారు. మతం పేరుతో ఉన్మాదం చేస్తూ ఓట్లు అడుగుతున్న బిజెపి వెనుక ఉన్న రహస్య ఎజెండాను ప్రజలు గుర్తించి రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. దేశంలో లౌకిక వాదాన్ని రక్షించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్న కేసీఆర్ కు ప్రజలు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వందరోజుల పాటు మాటల గారడీతో ప్రజలను మోసం చేస్తూ వస్తోందని, పది సంవత్సరాల అభివృద్ధి ఒకవైపు, 100 రోజుల అబద్ధాలు మరొకవైపు ఉన్నాయని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి పది సంవత్సరాల అభివృద్ధికి కృషి చేసిన బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్వార్ధ రాజకీయాలకు ఈడిని ఉపయోగించు కుంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్, ఎమ్మెల్సీ కవిత ను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. ఏ మాత్రం ఆధారాలు లేకుండా, కేవలం అప్రూవర్ లు ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా కల్వకుంట్ల కవితను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బహుజన వాదం, తెలంగాణ వాదం రెండు వేరు వేరు కాదన్న రెండూ పీడిత వర్గాల కోసమేనని వివరించారు. గురుకుల కార్యదర్శిగా నాటి ప్రభుత్వ హయాంలో తాను అప్పటి సంక్షేమ శాఖ మంత్రి, ప్రస్తుత పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ చొరవతో ఎంతో మంది పేద పిల్లలను అంతర్జాతీయ స్థాయి విద్యను అందించేలా కృషి చేశానని వివరించారు. మంచి మనసున్న కొప్పుల ఈశ్వర్ ను పార్లమెంటుకు పంపిస్తే భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు

**జంపింగ్ జపాంగ్ లకు బ్రాండ్ అంబాసిడర్ వివేక్**

**-మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**

వేల కోట్ల రూపాయల అస్తులున్న వివేక్ వెంకటస్వామి కుటుంబ సభ్యులు జనరల్ స్థానాల్లో ఎందుకు పోటీ చేయడంలేదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రశ్నించారు. వివేక్ వేల కోట్లకు రేవంత్ తో ఒప్పందం కుదుర్చుకుని ఒకే కుటుంబానికి చెందిన రెండు ఎమ్మెల్యే స్థానాలు, ఒక ఎంపీ స్థానాన్ని కేటాయింప చేసుకున్నారని ఆరోపించారు. జంపింగ్ జపాంగ్ లకు బ్రాండ్ అంబాసిడర్ వివేక్ అని సుమన్ అన్నారు.

# భానుడి భగభగ

(మొదటి పేజీ తరువాయి)

వినియోగం కూడా పెరిగింది. భూగర్భ జలాలు తగ్గుతుండడంతో బోరు బావులలో కూడా నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడే ఎండలు దంచి కొట్టడంతో ఇంకా ముందు ముందు ఎలా ఎండలు కొడుతాయో అని ప్రజల్లో భయాందోళన నెలకొంది.

# ఫోన్ టాపింగ్ పై సమగ్ర విచారణ జరపాలి

**- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డి**

**సూర్య, జమ్మికుంట**



ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రులు హరీష్ రావు కేటీఆర్ ఎంపీ సంతోష్ రావు పాత్రలపైన సమగ్ర విచారణ జరపాలని జమ్మికుంట మార్కెట్ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి టి పి సి సి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ డిజిపి కి వినతిపత్రం అందించారు గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వంలోని పెద్దల ఆదేశాల మేరకు తాము ఫోన్ టాపింగు పాల్పడ్డామని పోలీసు అధికారులు వాంగ్మూలం ఇస్తున్న నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఏర్పాటుచేసిన వార్ రూమ్ ని తనిఖీ చేసి నిజాలు బయటపెట్టాలని వారు కోరారు హుజురాబాద్ ఉప ఎన్నికల్లో సైతం స్థానిక నాయకుల ఫోన్ టాపింగ్ చేసి అప్పటి మంత్రి హరీష్ రావు నాయకులను భయభ్రాంతులకు గురి చేసి కోట్లాది రూపాయలతో కొనుగోలు చేశాడని ఆరోపించారు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సమగ్రంగా దర్యాప్తు చేసి ఇందులో టిఆర్ఎస్ నాయకులు దోచుకున్న సొమ్మును రికవరీ చేసి బాధితులకు అందించాలని వారు బిజెపికి విజ్ఞప్తి చేశారు

# సాయిబాబా ప్రధాన ఆలయానికి 51,116 విరాళం

**సూర్య, చొప్పదండి**



చొప్పదండి పట్టణం లోని సాయిబాబా ప్రధాన ఆలయం నిర్మితమై ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన సిమెంట్ బ్రిక్స్ వ్యాపారి, బొడిగే మోహన్-వనిత దంపతులు 51,116 రూపాయలు విరాళం అందచేశారు.ఈ విరాళాన్ని ఆలయ ట్రస్టు చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డి కి అందజేశారు. ఈ సంధర్భంగా ఆలయ చేర్మేన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో బాగంగా ఎవరైన భక్తులు ట్రస్టు సభ్యులుగా చేరాలనుకుంటే ఆలయ ట్రస్టు కమిటీ కి తెలుపగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు ప్రధాన కార్యదర్శి డోలి రాజయ్య, కోశాధికారి దండె లింగన్న, జాయింట్ సెక్రటరీ దూస రాము, ఉపాధ్యక్షులు కటకం మహేష్, కార్యవర్గ సభ్యులు తాటిపెల్లి అంజయ్య, ట్రస్టు సభ్యులు వల్లాల నగేష్, గుర్రం ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ లో ఓటరు అవగాహన ర్యాలీ

**సూర్య, హుజురాబాద్:(6)**




హుజురాబాద్ పట్టణంలోని 17వ వార్డులో మెప్మా ఆధ్వర్యంలో గురువారం ఓటరు అవగాహన, చైతన్య ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మెప్మా అధికారులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి 14 ఏప్రిల్ 2024 వరకు అవకాశం ఉందని అన్నారు. నూతనంగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలనుకునే యువత, యువకులు ఫామ్ 6 ద్వారా ఆన్ లైన్ లో నమోదు చేసుకోవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసీ కే. మానస, సిఎల్ఆర్పీ పి. స్వరూప, ఆర్పీ చాంద్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఈ మొక్కలను తొలగించరా...!?

**- కోనో కార్పస్ లతో పర్యావరణానికి నష్టం**

**సూర్య, హుజురాబాద్**



పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి నష్టం వాటిల్లే కోనో కార్పస్ మొక్కలను తొలగించాలని పర్యావరణ ప్రేమికులు అధికారులను కోరుతు న్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా పచ్చదనాన్ని పెంచడం కోసం ప్రభుత్వం గతంలో కోనో కార్పస్ మొక్కలను తెలంగాణ వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో, గ్రామాల్లో పెంచింది. ఇది అమెరికా దేశానికి చెందిన మొక్క, తొందరగా



ఏను కోవడమే కాకుండా పచ్చటి ఆకులతో నీడనిస్తుంది. ఇవి తొందరగా పెరగడం, పచ్చటి ఆకులతో నీడనిస్తుండడంతో ప్రభుత్వం వీటిని పలుచోట్ల నాటించింది. కానీ కోనో కార్పస్ మొక్కల వల్ల శ్వాస కోశ వ్యాధులు, ఆస్తమా, తదితర వ్యాధులతో పాటు మొక్కల వేర్లు భూమిలోకి చొచ్చుకొని పోయి నీటిని పీల్చుకుంటాయని, పైప్ లైన్స్ ధ్వంసం చేస్తాయని, మొదలగు దుష్పరినామాలు ఉన్నాయని పరిశోధకులు తెలిపారు. దీంతో ప్రభుత్వం కోనో మొక్కలతో ఉన్న నష్టాన్ని గుర్తించి వాటిని నాటడం నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ అప్పటికే పలు ప్రాంతాల్లో ఈ మొక్కలు పెరిగి పెద్దవై పర్యావరణానికి హాని కలగ చేస్తున్నాయి. పలు ప్రాంతాల్లో పర్యావరణ ప్రేమికులు వాటిని తొలగించాలని అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వాటిని తొలగించి వాటి స్థానంలో ఇతర మొక్కలు నాటుతున్నారు. మున్సిపల్ పరిధిలో కూడా ఈ మొక్కలను తొలగించి వేరే మొక్కలను నాటాలని ప్రజలు కోరుతున్నారు.

**కోనో కార్పోస్ తో వ్యాధులు... వేణుగోపాల్....**

పర్యావరణం కోసం నాటిన కోనో కార్పస్ మొక్కల వల్ల ప్రజలకు ఆస్తమా, శ్వాస కోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వాటిని మున్సిపల్ అధికారులు తొలగించాలని సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ అన్నారు.

## లెక్చరర్‌ను సన్మానించిన కళాశాల యాజమాన్యం

**సూర్య,రాయికల్**



రాయికల్ పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో గత 9 సంవత్సరాలుగా భౌతిక శాస్త్ర ఆధ్యాపకునిగా విధులు నిర్వహిస్తు, అంకిత భావంతో పనిచేస్తున్న బదినపల్లి వంశీకృష్ణ ఇటీవల ప్రకటించిన గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాలలో ఉద్యోగం సాధించినందున, సన్మానించి, చిరు జ్ఞాపికను జ్ఞానోదయ కళాశాల ప్రిన్సిపల్ బండారు సుమన్ రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు చిలువేరి సురేష్,తాటికొండ నాగరాజు,పూడూరి గంగ స్వామి,చంద్రగిరి భార్గవ్, బోడ నాగరాజు,కొత్తపెల్లి వినోద్ పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను వసూలులో హుజురాబాద్ కు 2వస్థానం

**- కమీషనర్ సమ్మయ్య**

**సూర్య, హుజురాబాద్**



2023 - 24 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను వసూలులో హుజురాబాద్ పురపాలక సంఘం రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచిందని హుజురాబాద్ మున్సిపల్ కమీషనర్ సల్వాది సమ్మయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ మున్సిపల్ పరిధిలో మొత్తం ఆస్తి పన్ను 2,49,00,000 రూపాయలు కాగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి 2,29,00,000 రూపాయలు వసూలు చేసినట్టు ఆయన తెలిపారు. మున్సిపల్ పరిధిలోని మొత్తం ఆస్తి పన్నులు 92.12 శాతం వసూలు అయినట్లు ఆయన తెలిపారు. 92 శాతం వసూలు చేయడం వల్ల రాష్ట్రంలో హుజురాబాద్ మున్సిపల్ కు రెండవ స్థానం దక్కిందని ఆయన తెలిపారు. కాగా ఈ నెల 31 వరకు ఆస్తి పన్ను చెల్లించడానికి చివరి తేదీ అని ఆయన తెలిపారు. ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, ఇతర షాపింగ్ గదుల కిరాయిలు బకాయి ఉన్న యజమానులు పన్నులను నిర్ణీత గడువులోగా చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కె. రాం మోహన్ రాయ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి. సంపత్ రావు, ఇంచార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ యం. కిషన్ రావు, కార్యాలయ బిల్ కల్లెక్టర్లు, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ గారిచే శిశుగృహ పాప దత్తత

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో కరీంనగర్ శిశుగృహ లోని పాపను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారి టీ- CARA, అడాప్షన్ రెగ్యులేషన్స్-2022 ప్రకారం దత్తత ను హైదరాబాద్ చెందిన దంపతులకు గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఇవ్వడం జరిగింది. జనవరి నెలలో దత్తత ఇచ్చిన పాప యొక్క చెన్నై కి చెందిన దంపతులకు దత్తత ఉత్తర్వుల కాపీని గురువారం జిల్లా కలెక్టర్ చే అందజేయడమైనది. ఈ సందర్భంగా దత్తత తీసుకున్న దంపతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు భవిష్యత్తులో మంచి విద్య, పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, పి.ఓ(ఎన్.ఐ.సి) తిరుపతి, శిశుగృహ మేనేజర్ తేజస్వి, సిబ్బంది రాజేశ్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గణపతి సుబ్రహ్మణ్యేశ్వర సహిత నవగ్రహ ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ట...

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ పట్టణం తీగలగుట్టపల్లి లోని శ్రీ శివ భక్తాఆంజనేయస్వామి స్వయంభు దేవాలయంలో గణపతి సుబ్రహ్మణ్యేశ్వర సహిత నవగ్రహ గజస్తంభ శిఖర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొనిగత మూడు రోజులుగా దేవాలయంలో వేద పండితుల ప్రత్యేక పూజలు చేపట్టారు.
వేదమంత్రోత్సవాల నడుమ ప్రతిష్ట కార్యక్రమం విజయవంతంగా ఘనంగా జరిగింది. ఇట్టి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో భాగంగా లక్ష్మీ గణపతి , నవగ్రహ సహిత హెూమం నిర్వహించారు. 1వ డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో తీగల గుట్టపల్లి ప్రజలు , భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

**సూర్య, హుజురాబాద్**



ఐఏయూవైఎస్ఏ ఇంటర్నేషనల్ యునైటెడ్ యంగ్ స్టార్ అసోసియేషన్ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా గురువారం హుజురాబాద్ పట్టణంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధి మాట్ల జవహర్ చటర్ జీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అజయ్, పవన్, అఖిల్, రవళి, శ్రీలత పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా గోస్కుల శ్రీనివాస్

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ న్యాయవాదుల సంఘంకు గురువారం జరిగిన ఎన్నికలలో అధ్యక్షునిగా గోస్కుల శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా బండి రమేష్, ప్రధాన కార్యదర్శి గా మట్టెల తిరుపతి, లైబ్రరీ సెక్రటరీ గా అప్పని రాజు, కోశాధికారిగా ఎం. దివ్య, సీనియర్ ఎక్సిక్యూటివ్ మెంబర్ గా పులుగు లింగారెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు కె. భగవాన్ రెడ్డి, సికె జేమ్స్, ఎన్. సత్యనారాయణలు తెలిపారు. మొత్తం 115 మంది ఓటర్లకు గాను 113 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన గోస్కుల శ్రీనివాస్ కు 71 ఓట్లు, యతిపతి అరుణ్ కుమార్ కు 41ఓట్లు వచ్చాయి. కాగా ఒక ఓటు చెల్లకుండా పోయింది. ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన బండి రమేష్ కు 59 ఓట్లు బోనగిరి కుమారస్వామి కి 52 ఓట్లు రాగా 2 ఓట్లు చెల్లలేదు. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన మట్టెల తిరుపతి కి 64 ఓట్లు, ఎర్రోళ్ల రమేష్ కు 45 ఓట్లు రాగా 4 ఓట్లు చెల్లకుండా పోయాయి. కోశాధికారి పదవికి పోటీచేసిన ఎం. దివ్య కు 66 ఓట్లు రాగా, సిహెచ్ భానుకిరణ్ కు 44 ఓట్లు రాగా 3 ఓట్లు చెల్లకుండా పోయాయి. లైబ్రేరియన్ పదవికి పోటీచేసిన అప్పని రాజు కు 56 ఓట్లు, బత్తుల తిరుపతి కి 54 ఓట్లు రాగా 3 ఓట్లు చెల్లకుండా పోయాయి. సీనియర్ ఎక్సిక్యూటివ్ సభ్యులుగా పోటీ చేసిన పులుగు లింగారెడ్డికి 65 ఓట్లు, అందె వెంకటేశ్వర రావు కు 48 ఓట్లు వచ్చాయి. కాగా సహాయ కార్యదర్శి గా పి. జ్యోత్న దేవి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ గా కల్వల సౌమిత్ర, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా కె. సరిత, మహిళా సభ్యురాలుగా ముశం మౌనిక లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

## మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రణవ్

**సూర్య, జమ్మికుంట రూరల్**



జమ్మికుంట మండలంలోని సైదాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ రాజారామ్ తల్లి ప్రమీల అనారోగ్యంతో మృతి చెందగా మృతురాలి కుటుంబ సభ్యులను గురువారం హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, ఎండి. సజ్జద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూపతిపూర్ సహకార సంఘ సర్వసభ సమావేశం



**సూర్య,రాయికల్**

రాయికల్ మండలం భూపతిపూర్ సహకార సంఘ సర్వ సభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఏనుగు ముత్యం రెడ్డి మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు ధ్యేయంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని,స్వల్ప కాలిక, దీర్ఘ కాళికా రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధిలో పాటుపడాలని పేర్కొన్నారు. 2023-2024 వార్షిక నివేదికను ఆదాయం, ఖర్చులను సంఘ కార్యదర్శి చంద్రశేఖర్ చదివి వినిపించడం జరిగింది. వార్షిక సంవత్సరం 88 లక్షల విలువైన ఫర్టిలైజర్లు అమ్మడం జరిగిందని,రైతులకు ఎల్లవేళలా యూరియా, కాంప్లెక్స్ ఎరువులను , విత్తనాలు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. సహకార సంఘం యందు డిపాజిట్ చేయాలని కోరుకుంటూ,సంఘ అభివృద్ధిలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నాగులమల్లయ్య గౌడ్, డైరెక్టర్లు కోసరి మహేష్, నేతుల లక్ష్మీనారాయణ,నిమ్మల భారతి శేఖర్ రెడ్డి,పాల్యా రమణ,కార్యదర్శి చంద్రశేఖర్, సిబ్బంది రాజేష్, రంజిత్, సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## లక్ష్మీనర్సింహా స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి

**సూర్య తిమ్మాపూర్**



కరీంనగర్ జిల్లా తిమ్మా పూర్ మండలం నల్లగొం డ గ్రామంలో శ్రీ సీతారా మ లక్ష్మీనర్సింహా స్వామి బ్రహ్మో త్సవాలకు మానకొండూరు శాసనసభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సభ్యులు,ఈవో, అర్చకులు ఎమ్మెల్యేను పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం కాళేశ్వరాన్ని పునరుద్ధరించాలి

**- రైతులకు సాగు నీరు అందించేలా చర్యలు చేపట్టాలి - ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**సూర్య జగిత్యాల**

ప్రభుత్వం కాళేశ్వరం పునరుద్దరణ చేయాలి, మూడు పిల్లర్లు బాగు చేసి, రైతులకు సాగు నీరు అందించే దిశగా చర్యలు తీసుకోవాలి అని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు. గురువారం సారంగాపూర్ మండలం పోతారం గ్రామంలో సాగు నీరు అందక ఎండిన రైతులు గాడిపెల్లి వెంకటేష్, బోధాసు నర్సింగం వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం ఎస్సారెస్పీ కి గుండెకాయలాంటిదన్నారు. గతం లో చీఫ్ ఇంజనీర్ కార్యాలయం కూడా ఇక్కడే ఉండేదని తెలిపారు. ఆయకట్టు పెరిగిన తర్వాత ఒక 30 ఏండ్ల నుండి జగిత్యాల ప్రజలు నీటి కొరత చూడడం జరిగిందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి, నీటిని కరీంనగర్ వరకు ఆపి కిందికి కాళేశ్వరం నీటిని వదలడం జరిగిందని వివరించారు. దానివలన మన ప్రాంతంలో నీటి కొరత లేకుండా పచ్చని పంటలు పండాయి,విస్తీర్ణం పెరిగి 25 వేల ఎకరాల నుండి 63 వేల ఎకరాలకు పెరిగింది



అని తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం అందక పోగా ,నేడు పెట్టు బడి పెట్టిన పంట కూడా చేతికి రాక రైతులు నష్ట పోయే ప్రమాదం ఉంది. హరీశ్ రావు తప్పుడు మాటలు మాట్లాడా రని జీవన్ రెడ్డి విమర్శించడం హాస్యాస్పదం అన్నారు గతం లో కాళేశ్వరం తో ఒక్క ఎకరా పారలేదు అని చెప్పే నాయకులు ,నేడు కాళేశ్వరం లేకుండా పంటలు ఎండిపోయే పరిస్తితి వచ్చింది అని అన్నారు.. గత వేసవిలో చెరువులు నిండు కుండలా ఉంటే నేడు చెరువుల్లో,బావుల్లో నీరు లేని పరిస్తితి, రైతులు మళ్ళీ ప్రొక్లిన్,క్రేన్ ల సాయం తో పూడిక తీసే రోజులు వచ్చాయన్నారు. కౌలు రైతులు సైతం సాగు నీరు లేక ఇబ్బంది పడుతున్నారు అని,కౌలు రైతులకు కూడా రైతు బంధు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చారని ఎంతమందికి ఇచ్చారు ఓట్లకు వచ్చినపుడు ప్రజలకు చెప్పాలి అని డిమాండ్ చేశారు.కేసిఆర్ ని విమర్శించడం మాని రైతులకు న్యాయం చేయాలి అని హితవు పలికారు. గత వర్షాకాలం లో 100 ఏండ్ల లో కురవని వర్షాలు కురిశాయి అని,ఆ మూడు రోజుల్లో సంవత్సరం లో పడే వర్షం కురిశాయి అని అన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి ,రైతులకు నష్టం కలిగించే పనులు జరుగుతున్నా ఇక్కడి సీనియర్ నాయకులు ఎందుకు స్పందించడం లేదు చెప్పాలి అని,ప్రజలు గమనిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ మనోహర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, వైస్ఎంపీపీ సురేందర్,ఎంపీటీసీ సుధాకర్,మాజీ సర్పంచ్ ఢిల్లీ రామారావు,మాజీ ఎంపీటీసీ లు సాయిలు, నరసింహ రెడ్డి,యూత్ అధ్యక్షులు మధన్, యూత్ నాయకులు మహేష్, శేకర్,రైతులు లచ్చయ్య, వెంకటి, రాయనర్సు, అఖిల్, మల్లేష్, నర్సింహం,ఁగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా లక్ష్మారెడ్డి

**సూర్య జగిత్యాల టౌన్**



జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు గా సీనియర్ న్యాయవాది డబ్బు లక్ష్మారెడ్డి ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కోర్టులో జరిగిన ఎన్నికలలో రాచకొండ శ్రీరాములు, డబ్బు లక్ష్మారెడ్డిలు పోటీపడగా 2 ఓట్ల తేడాతో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా డబ్బు లక్ష్మారెడ్డి గెలుపొందారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి ని ఎమ్మెల్సీతాటిపర్తి జీవన్ రెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎస్ఆర్ఎస్పీ కెనాల్ లో గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

**సూర్య మేడిపల్లి**



మండలంలోని కొండాపూర్ గ్రామం శివారులో గల ఎస్ ఆర్ ఎస్ పీ కెనాల్ లో అందాద 40 నుండ 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన గుర్తు తెలియని మగ వ్యక్తి శవం కెనాల్ లో కొట్టుక పోతు కొండాపూర్ గ్రామ శివారులో కనబడగా కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్ డీ ఇసాక్ ఇచ్చిన పిర్యాదు మేరకు మేడిపల్లి ఏ ఎస్ ఐ హసన్ మహమ్మద్ కేసున మోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదిలో బద్రపరిచినట్లు తెలిపారు. చనిపోయిన వ్యక్తి జీన్ ప్యాంటు,నీలిరంగు పువ్వుల చొక్కా ధరించాడు అని,ఎవరైనా ఆచూకీ తెలిసిన వ్యక్తులు మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని కోరారు.

## షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

**సూర్య గొల్లపల్లి**



గొల్లపల్లి అదర్శ పాఠశాల లో జిల్లా "షీ టీమ్" ఆధ్వర్యంలో విద్యార్థులకు గురు వారం పలు అంశా లపై అవగా హన కల్పించారు. ఈవ్ టీజిం గ్, చైల్డ్ లేబర్, హ్యూమన్ ట్రాఫికింగ్, డ్రగ్స్, వ్యభిచారం, ఇల్లీగల్ బాడీ ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్, అండర్ ఏజ్ డ్రైవింగ్, సోషల్ మీడియా వినియోగం, అపరిచి తులతో ప్రవర్తన మొదలైన విషయాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో జాగ్రత్తలు పాటిస్తూ క్రమశిక్షణతోట విజ్ఞానం సంపాదిం చుకుంటూ ఉన్నత స్థితిలో ఉండాలని విద్యార్థులకు మార్గదర్శనం అందిం చారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్ ఐ. బేగ్ "షీ టీమ్" సభ్యులు, పాఠశాల ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్, వైస్ ప్రిన్సపల్ కె.నగేష్ , ఉపాధ్యాయులు సంధ్యారాణి, జి.సంధ్య, రమాదేవి, హరిప్రియ, ఆర్.సంధ్య, అన్నపూర్ణ, అర్చన, రజిత, ప్రియంక మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్ఎస్ఎఫ్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**సూర్య -కోరుట్ల**



కోరుట్ల పట్టణం లోని లిటిల్ ఫ్లవర్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ దిలీప్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల ను తల్లిదండ్రులుసెల్ ఫోన్ కు దూరంగా ఉంచాలని, పిల్లలు సెల్ ఫోన్ వాడడం వల్ల కలిగే నష్టాలను , జాన్క్ ఫుడ్ కు దూరంగా ఉంచాలని పిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం కరెస్పాండంట్ తుమ్మనపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్లే వే మెతడ్ లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే ఉదేశ్యంతో ప్లే స్కూల్ ప్రారంభించమని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సిరికొండ గంగాధర్, తుమ్మనపల్లి మనోజ్ కుమార్, తుమ్మనపల్లి చంద్రప్రకాష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటివద్దే ఓటు..వృద్ధులకు వెసులుబాటు..

**సూర్య జగిత్యాల**



లోక సభ ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులకు, దివ్యఅంగులకు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కేంద్ర ఎన్నికల సంఘం అందు బాటులోకి తెచ్చిందని,అందుకు అర్హులేవరు ఎలా దరఖాస్తు చేసుకోవాలి ,ఆ విధానం పై ఆ వృద్ధుల,దివ్యంగుల సమాచారం కోసం తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసి యేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది హరి ఆశోక్ కుమార్ ఇలా వివరించారు..అర్హులు 85 ఏళ్ళు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా అంగ వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు వేసే వీలుంది. పోలింగ్ అధికారులు ఓటర్ ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించు కుంటారు .నిబంధనలకు అనుగుణంగా ఓ కంపార్ట్ మెంట్,ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ తెస్తారు. ఇంటి నుంచే ఓటేసే వెసులుబాటు ను ఉపయో గించుకునే వారు ఫారం 12డీ నింపి రిటర్నింగ్ అధికారికి గాని,సహాయ రిటర్నింగ్ అధికారికి గాని దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారు తమ పూర్తి చిరునామా,సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ పొందుపరుచాలి.దరఖాస్తు అందుకున్న తర్వాత సంబంధించిన దరఖాస్తుదారు ఇంటికి బూత్ స్థాయి అధికారులు వెల్లుతారు.అర్హతలను బట్టి ఇంటి నుంచే ఓటు సౌకర్యం కల్పించాలా వద్దా అనేది నిర్ణయిస్తారు. అర్హత ఉంటే దరఖాస్తుదారు ఇంటికే వెళ్ళి ఓటు వేయిస్తారు. రహస్య ఓటింగ్ లాగే అన్ని చర్యలు తీసుకుంటారని,ఎన్నికల కమిషన్ కల్పించిన ఈ సౌకర్యంను సద్వినియోగం చేసుకోవాలని 85 ఏళ్ల పైబడిన్న సీనియర్ సిటీజేన్లకు ,40 శాతానికి పైగా ఉన్న అంగవైకల్యం ఉన్న వారికి సమాచారం కోసం హరి ఆశోక్ కుమార్ ఇంటి నుంచే ఓటు సౌకర్యం వివరాలు తెలిపారు.

## ప్రమాదవశాత్తు నిప్పంటుకుని స్కూటీ దగ్ధం

**సూర్య జగిత్యాల టౌన్**



జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణి నగర్ లో నాగమల్ల శ్రీనివాస్‌కు చెందిన ఏ పి 9027 నంబర్ గల ద్విచక్ర వాహనం గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధం అయ్యింది. శ్రీనివాస్ తన స్కూటీ రిపేర్ కోసం మెకానిక్ షాప్ కు తీసుకు వెళ్లి బయట నిలిపి ఉంచగా ఆకస్మికంగా బైక్ నుండి మంటలు చెలరేగాయి. ఆందోళనకు గురైన స్థానికులు సమీపంలో నీరు ప్రవహిస్తున్న డ్రైనేజీలో స్కూటీ ని నెట్టి వేయడంతో మంటలు చల్లారి పోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయ్యింది. అయితే ఎండ తీవ్రతతోనే బైక్ దగ్ధం అయి ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

## శ్రీ సీతారామ స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**సూర్య జగిత్యాల**



జగిత్యాల పట్టణంలోని ధరూర్ క్యాంప్ కోదండ రామాలయంలో గురువారం కరీంనగర్ పట్టభద్రులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా జీవన్ రెడ్డి ధరూర్ శ్రీ కోదండ రామలయంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధ్యక్ష ,పాలకవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలుపి జీవన్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు.

## జీవన్ రెడ్డిని కలిసిన చెన్నూరు ఎమ్మెల్యే

**సూర్య జగిత్యాల**



ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించగా, గురువారం జీవన్ రెడ్డి ని చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకట స్వామి, పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ జగిత్యాలలోని ఇందిరా భవన్ లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నివాసం ఇందిరా భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

# ఓటు ప్రాముఖ్యత వివరిస్తూ స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ**

**- జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదయ్యేలా అవగాహన కార్యక్రమాల నిర్వహణ**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

బాధ్యత గల పౌరులుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటు ప్రాముఖ్యత వివరిస్తూ స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ అన్నారు. గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పార్లమెంట్ ఎన్నికలలో పోలింగ్ శాతం పెరిగేలా స్వీప్ కార్యక్రమాలు నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ఉన్న 3 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 7 లక్షల 15 వేల 735 మంది ఓటర్లు ఉన్నారని, ప్రతి ఒక్క ఓటరు ఎన్నికలలో తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోనేలా ఓటు ప్రాముఖ్యతపై విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్లను చైతన్యపరిచేందుకు, ఓటింగ్ శాతం పెరిగేలా, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు ఓటర్



అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదయ్యే విధంగా ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గత ఎన్నికలలో తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. స్వీప్ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని విద్యాసంస్థల్లో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్ లు ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఉన్న అన్ని డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేసి వారి ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో ఉన్న దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ సీనియర్ సిటిజన్లు అంతా తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలోఉన్న వృద్ధాశ్రమాలు, దివ్యాంగుల సంస్థలలో ఓటర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, 85 సంవత్సరాల వయసు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైతే ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగిం చుకునే అవకాశం ఉందని వివరించాలని అన్నారు. కార్మికుల కోసం ప్రత్యేక ఓటర్ నమోదు, ఓటర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు హనుమా నాయక్, బి. గంగయ్య, జెడ్పీ సి.ఈ.ఓ. నరేందర్, డి.ఆర్.డి.ఓ. రవీందర్, డి.పి.ఓ. ఆశాలత, డి.ఈ.ఓ.- డి.మాధవి, స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రౌఫ్ ఖాన్, డి.ఎం.అండ్ హెచ్. ఓ. డాక్టర్ కె.ప్రమోద్ కుమార్, ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన, పరిశ్రమలశాఖ జిఎం మధుసూదనా చారీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మేధావులుగా తీర్చిదిద్దిన ఘనత సంపత్ రావుదే.

**- అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్**

**సూర్య, సెంటినరీ కాలనీ**



ఎందరో విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దిన ఘనత పల్లెపాటి సంపత్ రావుది అని పెద్ద పల్లి జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, జిల్లా విద్యాధికారిని డి మాధవి అన్నారు. గురువారం రామగిరి మండలంలోని జేఎన్టీయూ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఆరు మండలాల ఎంఈఓ పల్లెపాటి సంపత్ రావు పదవీ విరమణ వేడుకలను తస్మా జిల్లా అధ్యక్షుడు అబ్బు కేశవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులకు విద్యాబోధనలు చేసి వారిని మేధావులుగా తీర్చిదిద్దారని అన్నారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదని తన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి, ట్రస్మా అడ్వైజర్ వై.శేఖర్ రావు, నాయకులు, కరస్పాండెంట్లు బర్ల శ్రీనివాస్, లక్ష్మణ్ కుమార్, చదువు వెంకట్ రెడ్డి, పాపిరెడ్డి, రవీందర్రావు, అశోక్, పాశం ఓదెలు యాదవ్, మబ్బు శ్రీనివాస్, యూనివర్సల్ స్కూల్ కరస్పాండెంట్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద యువతి పెండ్లికి సహాయం

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం లోంకకేసారం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన నాంసాని సుస్మిత తల్లిదండ్రులు నాంసాని లక్ష్మి రాజయ్య తల్లిదండ్రులు గతంలోనే అనివార్య కారణాల వల్ల ఇద్దరు మృతి చెందగా సుస్మిత వివాహం ఈ నెల 28న జరగనుందని తెలిసి మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి యువతి యొక్క ఆర్థిక పరిస్థితిని లైన్స్ క్లబ్ పెద్దపల్లి వారికి వివరించారు. వెంటనే స్పందించి లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సదుల వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ మీసాల సత్యనారాయణ ,సభ్యులు ఓంకార్ చేతుల మీదుగా యువతికి రూ.11,116/- ను అందజేయడం జరిగింది. దాతలకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఇంకా ఎవరైనా సహాయం చేయాలనుకునే వారు 9849655990 ఫోన్ పే చేసి సహాయం చేయగలరని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సెంటినరీ కాలనీ ప్రెసిడెంట్ మోల్మురి శ్రీనివాస్,మాజీ ఉపసర్పంచ్ ఒజ్జ ఓదెలు,మేకల మారుతి యాదవ్, చెల్పూరీ ఓదెలు,నాంసని సందీప్ పాల్గొన్నారు

## అంగరంగ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ వేడుకలు ప్రారంభం

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్ పూర్ మండల కేంద్రం లోని పిల్లిపల్లీ లో గల రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ వేడుకలు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గణపతి పోజొత్సవంతో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. దాదాపు వారం రోజుల పాటు జరగనున్న రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం వేడుకలు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా జరగాలని ఆకాంక్షిస్తూ ప్రథమంగా గణపతి పూజొత్సవంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం కల్యాణోత్సవం వేడుకల నేపథ్యంలో సాంప్రదాయ ప్రకారంగా డప్పు చప్పుళ్ల మధ్య రేణుక ఎల్లమ్మ ఆలయం నుండి పాలపోరుక వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు దేవాలయాన్ని శుద్ధి చేసి రేణుక ఎల్లమ్మ మాతకు కొబ్బరికాయలు కొట్టి గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ ఉత్సవ వేడుకలు ప్రారంభ రోజే స్థానిక కమాన్ పూర్ గ్రామంలోని గౌడ కులబాందవులతో పాటు వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తరలివచ్చి రేణుక ఎల్లమ్మ ను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

## ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ప్రదర్శన

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



బేటీ బచావో, బేటి పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంగంపల్లి మైనార్టీ బాలికల పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం వారిచే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సుచరిత మాట్లాడుతూ బాలికలు మహిళా చట్టాలు, మహిళా సంరక్షణ, హెల్ప్ లైన్ నెంబర్స్, సఖి కేంద్రం సేవలు, గుడ్, బాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ కార్యక్రమంలో మంథని, రంగంపల్లి మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు పాల్గొని, వారు తయారు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ప్రాజెక్ట్ లను ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, డిసిపిఓ పర్వీన్, ఎం.డబ్ల్యూ.డి సూపర్డెంట్ ఫర్హాన్, సీనియర్ అసిస్టెంట్ ఆఫ్సన్, ఆర్ట్ టీచర్స్ వాణి, కల్పన, స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా సంకష్టహర చతుర్థి వేడుకలు

**సూర్య మంథని**



స్థానిక శ్రీమహాగణపతి ఆలయంలో సంకష్టహర చతుర్థి వేడుకలను భక్తులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి పల్లి రాముశర్మ ఆధ్వర్యంలో శ్రీమహాగణపతి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

## నాణ్యత లేని సిమెంటు రోడ్లు పట్టించుకోని అధికారులు

**- పిఆర్ఏఈ పై పెద్దపల్లి పిఆర్ఈఈ కి ఫిర్యాదు చేసిన బొల్లంపల్లి సంతోష్ గౌడ్**

**సూర్య ముత్తారం**

ముత్తారం మండలంలోని పలు గ్రామాలలో వేస్తున్న సిమెంట్ రోడ్లు నాణ్యత లోపిస్తుందని సంబంధిత అధికారులకు తెలుపగా పిఆర్ఏఈ స్పందించడం లేదని తెలిపారు. సిమెంట్ రోడ్లు వేస్తున్న కాంట్రాక్టర్ల కాసులకు కక్కుర్తి పడి పీఆర్ఏఈ వారికి వత్తాసు పలుకుతూ నాణ్యత పాటించకుండా రోడ్లు నిర్మిస్తున్న సదరు కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతున్నారని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన బొల్లంపల్లి సంతోష్ గౌడ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లలో ఉపయోగించాల్సిన వైబ్ రేటింగ్ యంత్రాన్ని ఉపయోగించటం లేదని, రోడ్డు వేయడంలో ఇసుకను ఎక్కువగా వాడుతున్నారని, కాంక్రీటు తక్కువగా ఉపయోగిస్తున్నారని, నాణ్యమైన మెటీరియల్ వాడడం లేదని తెలిపారు. రహదారి మధ్యలో మూడు ఇంచులు వేస్తున్నారని, సరైన తనిఖీ చేయని పీఆర్ఏఈ రోడ్డు వేయడానికి ముందు రోడ్డుపై రాతి చిప్స్ వేయటం లేదని, నాణ్యతతో కూడిన రోడ్ల గురించి ప్రజలు అధికారులను అడిగినప్పుడు నిష్పక్షపాతంగా వివక్ష చూపుతూ కాంట్రాక్టర్స్ కు వత్తాసు పలుకుతున్న ఏఈ పై చర్యలు తీసుకోవాలని కోరారు. సరైన నీటి క్యూరింగ్ కూడా చేస్తలేరని, రోడ్లు వేయడంలో తక్కువ స్థాయి నాణ్యతను ఉపయోగిస్తున్నారనీ బొల్లంపల్లి సంతోష్ గౌడ్. ఆవేదన వ్యక్తం చేస్తూ ముత్తారం పీఆర్ఏఈ పైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ టికెట్ గజ్జెలకే కేటాయించాలి.

**సూర్య పెద్దపల్లి**



తెలంగాణాలోని 80లక్షల మంది మాదిగల ఆత్మ గౌరవానికి సవాలుగా మారిన పెద్దపల్లి పార్లమెంటు సీటును గజ్జెల కాంతంకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మాదిగశక్తి ఆద్వర్యంలో ఢిల్లీలోని ఏఐసిసి కాంగ్రెస్ కార్యాలయం ముందు గురువారం బలప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మాదిగశక్తి వ్యవస్థాపక అద్యక్షుడు బొంకూరి సురేందర్ సన్ని మాట్లాడుతూ, కాంగ్రెస్ నేత కల్నల్ రోహిత్ చౌదరీని కలిసి రాష్ట్రంలో మాదిగ సామజికవర్గానికి రాజకీయంగా జరుగుతున్న అన్యాయంపై వివరించడం జరిగిందని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ స్థానంలో మాదిగకు కేటాయించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ పరిధిలోని చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలుగా అతని కుటుంబానికి చెందిన వారికి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇవ్వడం జరిగిందని, వారి గెలుపుకు సైతం మాదిగలు తోడ్పడ్డారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికీ యావత్తు మాదిగలు అండగా నిలబడిన విషయాన్ని అధిష్టానం మరిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వంశీకృష్ణ పేరును మార్చి గజ్జెల కాంతానికి టికెట్ కేటాయించాలని కోరారు. ఈ ధర్నాలో మాదిగ జేఏసీ, మాదిగ రాజకీయ వేదిక, మాదిగ దండోరా సంఘాల నాయకులు కల్లేపల్లి రవి, సతీష్, కిషోర్, పర్వతాలు, చంద్రు, సందీప్, నర్సయ్య, పవణ్ కళ్యాణ్, మొగిలి, భూమయ్య, రాజేందర్, సుందర్, కాంతయ్య, రాజేశ్వరి, సుజాత సిరిసిల్ల నర్సయ్య, శారద, రెండువందల మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సర్వ సభ్య సమావేశం

**- రైతుల సమిష్టి కృషితోనే సహకార సంఘం అభివృద్ధి - చైర్మన్ జంగా వెంకటరమణ రెడ్డి**

**సూర్య చిగురు మామిడి**

చిగురుమామిడి మండలంలో రైతుల సంక్షేమ సహకార సంఘాల లక్ష్యమని రైతుల శ్రేయసే సహకార సంఘాల ప్రధాన ధ్యేయమని రైతులకు రుణాలు అందజేతకు సహకార సంఘాలు పనిచేస్తాయని సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం చైర్మన్ రమణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సర్వసభ్య సమావేశంలో సంఘం కార్యనిర్వహణ అధికారి కాటం నరసయ్య వార్షిక నివేదికను రైతులకు సభ్యులకు వివరించగా సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ సంఘం పరిధిలో సభ్యులకు 8 కోట్ల 67 లక్షల రూపాయలు క్రాప్ లోన్, మూడు కోట్ల 64 లక్షల రూపాయల దీర్ఘకాలిక కర్షక మిత్రా లోన్ ద్వారా ఇవ్వడం



జరిగిందన్నారు. వాయిదా మీరిన క్రాప్ లోను వడ్డీ సభ్యులు చెల్లించి రుణమాఫీకి అర్హత పొందగలరని విజ్ఞప్తి చేశారు. గత యాసంగి వానకాలం సీజన్లలో సంఘం పరిధిలోని 17 గ్రామాలలో మొత్తం మూడు లక్షల 27 వేల క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అలాగే గురుకులపల్లి లో పెట్రోల్ పంపు నిర్మాణము మండల కేంద్రంలోని కార్యాలయం మొదటి అంతస్తు నిర్మాణం పనులు జరుగుతున్నట్లు తెలిపారు. సహకార సంఘాల ద్వారా వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ ఎరువులను విక్రయిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. ఎరువుల వ్యాపారము చిగురుమామిడి ఇందుర్తి రేకొండ సెంటర్ల ద్వారా అందించడం జరిగిందన్నారు. రైతుల సమస్య కృషితోనే సహకార సంఘం అభివృద్ధి చెందుతుందని రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని రమణారెడ్డి కోరారు. ఈ వార్షిక సభలో సంఘం ఉపాధ్యక్షులు కరివేద మహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు ముద్రకొల్ల రాజయ్య తాళ్లపల్లి తిరుపతి కూతురు రవీందర్ రెడ్డి అంది స్వామి పోతన వేణి శ్రీనివాసు చాడ శ్రీధర్ రెడ్డి, మాచర్ల లచ్చవ్వ, లక్ష్మి, సంఘ సెక్రటరీ కాటం నరసయ్య, అంగం సిబ్బంది శ్రీనివాసు కుమారస్వామి లింగయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాలలో పోలీసుల కవాతు



**సూర్య, హుజురాబాద్ రూరల్**

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం గురువారం హుజురాబాద్ మండలం పోతిరెడ్డి పేట, సిర్సపల్లి గ్రామాలలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాట్సప్ గ్రూపు నందు అభ్యంతరమైన మెసేజ్ లు షేర్ చేయకూడదని, ఎలాంటి మీటింగ్ కైనా ముందస్తు పర్మిషన్ తీసుకోవాలని, శాంతియుత వాతావరణంలో ఎలక్షన్స్ జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ టౌన్ సిఐ బొల్లం రమేష్, సిఐఎస్ఎఫ్ ఆఫీసర్స్, జవాన్లు, ఎస్ఏటి టీం కరీంనగర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లా మున్నూరుకాపు యువత నియామకాలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



మున్నరుకాపు యువత జిల్లా అధ్యక్షులు రోళ్ళ సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్నూరు కాపు యువత కరీంనగర్ జిల్లా కమిటీ వేయడం జరిగింది. మున్నూరుకాపు యువత కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గన్నేరువరం మండలం మైలారం గ్రామానికి చెందిన పురంశెట్టి రమేష్ పటేల్, గన్నేరువరం మండలం కాసింపేట్ గ్రామం కి చెందిన గంప మహేష్ పటేల్ ను ప్రధాన కార్యదర్శిగా మున్నూరకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్, మున్నూరుకాపు జిల్లా అధ్యక్షులు రోళ్ల సతీష్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేయడం జరిగింది.

## ఉత్తమ రైతును సన్మానించిన శాస్త్రవేత్తలు.



**సూర్య,రాయికల్**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉత్తర తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన,విస్తరణ సలహా సంఘ సమావేశం జరిగింది.దీనిలో భాగంగా జగిత్యాల జిల్లా నుండి రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఓరుగంటి భీమ రాజ్ ను ఉత్తమ రైతుగా ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో ఎడిఆర్ డాక్టర్ జి శ్రీనివాస్, అల్లీపూర్ దత్తత గ్రామ ఇన్చార్జ్ డాక్టర్ డి ఏ రజనీ దేవి,ఆర్థిక శాస్త్రవేత్త,పొలాస శాస్త్రవేత్త ల బృందం అల్లీపూర్ ఎఫ్ ఇ ఒ అధ్యక్షులు అత్తినేని శంకర్, రైతులు ఓరుగంటి రాజలింగం,ఓరుగంటి రాజు,ఎల్లేశ్వరం శేఖర్,గొల్లపెల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## శివుని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

**- మాజీ ఎంపీ వినోద్**

**సూర్య, వీణవంక**



రాబోయే కాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు శివుని ఆశీస్సులతో సమృద్ధిగా పండి గ్రామస్తులంతా సుభిక్షంగా ఉండాలని మాజీ ఎంపి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బుధవారం వీణవంక మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో శ్రీ రాజ రాజేశ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవాలలో భాగంగా శివ పార్వతుల కళ్యాణం వైభవంగా జరిగింది. దీనికి మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి లు హాజరు కాగా ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే కాలంలో శివ పార్వతుల అశీస్సులతో కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని కోరారు. ఆలయ ప్రాంగణానికి ఆలయ కమిటీ కోరిన అభివృద్ధి పనులకు తమ వంతు ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి, జెడ్పీటీసీ వనమాల సాధవరెడ్డి, విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, వైస్ ఎంపిపి రాయిశెట్టి లత శ్రీనివాస్, ఎంపీటీసీ రజిత పుల్లా రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమౌళి, కోశాధికారి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ సుజాత కిషన్ రెడ్డితో పాటు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింగపూర్ లో జయతు... జయతు సినిమా ప్రారంభం

**సూర్య, హుజురాబాద్ రూరల్**



హుజురాబాద్ మండలం సింగపూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జయతు..... జయతు సినిమా ముహూర్తపు సన్నివేశం గురువారం ప్రారంభమైంది. హుజురాబాద్ కు చెందిన డాక్టర్ శ్రావణ్ వాహిని పిక్చర్ పేరుతో నిర్మిస్తున్న రెండో సినిమా జయతు.. జయతు ముహూర్తపు సన్నివేశం వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రారంభించగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం కళాకారులకు కొదవలేదని, డాక్టర్ శ్రావణ్ వైద్య రంగంలో సేవలు చేస్తూ కళా రంగంపై ఉన్న మమకారంతో సినిమాలు తీయడానికి ముందుకు రావడం అభినందనీయమని, ఈ చిత్రం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. హుజురాబాద్ ప్రాంతానికి చెందిన డాక్టర్ శ్రావణ్, జమదగ్ని లు సినిమా రంగంలో అడుగుపెట్టడం మరింత మందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ శ్రావణ్ కుమార్, నిర్మాత జమదగ్ని, హీరో రాఖీ, హీరోయిన్ శ్రీ రమ్య తదితరులు పాల్గొన్నారు. సినిమా రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ పదవ తేదీ నుండి జరుగుతుందని తెలిపారు.

## సీతారాముల ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలి

**- వొడితల ప్రణవ్**

**సూర్య, వీణవంక**



సీతారాముల ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ తెలిపారు. వీణవంక మండలంలోని వల్భాపూర్ గ్రామంలో అభయాంజనేయస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అర్చకులు శ్రీధర్ ఆచార్యులు, నరసింహారాచార్యులు గురువారం మధ్యాహ్నం 12. 30 నిమిషాలకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రణవ్ ను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా సీతారాముల కళ్యాణ మహోత్సవానికి 50వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించి అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, ఎంపీటీసీ జీడీ దేవేందర్, గంగాడి రాజిరెడ్డి, సాహెబ్ హుస్సేన్, సతీష్ గౌడ్, శ్రీపతి రెడ్డి, సదాశివరెడ్డి, పోరెడ్డి తిరుపతిరెడ్డి, చేపూరి రాజు, జైపాల్ రెడ్డి, గట్టయ్య, రాపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే, మాజీ ఎంపీ వినోద్

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సవిత మల్లయ్య కుమార్తె వివాహ వేడుకల్లో గురువారం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట మాజీ టూరిజం చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఎంపిపి ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి, జెడ్పిటిసి మాడ వనమాల సాధవ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి, నాయకులు వాల బాల కిషన్ రావు, కొత్తిరెడ్డి కాంతారెడ్డి, రమేష్, పోతుల నర్సయ్య, అడిగొప్పుల సత్యనారాయణ, జక్కు నారాయణ, నరసింహారెడ్డి, కాసం వీరారెడ్డి, చెక్క బండి శ్రీనివాస్ రెడ్డి, తాంద్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వల్భాపూర్ లో ఘనంగా అభయాంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవం

**సూర్య, వీణవంక:(12)**



వీణవంక మండలంలోని వల్భాపూర్ గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అర్చకులు శ్రీధర్ ఆచార్యులు, నరసింహారాచార్యులు గురువారం మధ్యాహ్నం 12.30 నిమిషాలకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి శాలువాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గతంలో బొడ్రాయికి ఇస్తానన్న ఒక లక్ష రూపాయలు చెక్కును అందజేశారు. సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం సీతారామ కళ్యాణం మహోత్సవం సందర్భంగా ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పురవీధుల నుండి తీసుకెళ్లడం జరిగింది. ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి, జెడ్పిటిసి మాడ వనమాల సాధవరెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి, నాయకులు వాల బాల కిషన్ రావు, కొత్తిరెడ్డి కాంతారెడ్డి, పోతుల నర్సయ్య, కామిడీ శ్రీనివాస్ రెడ్డి, అడిగోప్పల సత్యనారాయణ, శ్రీపతి రెడ్డి, చెక్క బండి శ్రీనివాస్ రెడ్డి, జీడి దేవేందర్, శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా పటిష్ట కార్యాచరణ

## - జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి - వేసవికాలంలో త్రాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

**సూర్య రాజన్న సిరిసిల్ల**

వేసవి కాలంలో సమృద్ధిగా త్రాగునీరు అందించే విధంగా పటిష్ట కార్యాచరణ రూపొందించి దాని అమలుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అదనపు కలెక్టర్ పి.గౌతమి తో కలిసి వేసవికాలంలో త్రాగునీటి సరఫరా, స్థితిగతులపై మండల స్థాయి, మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఎండాకాలం దృష్ట్యా త్రాగునీటి సరఫరా పకడ్బందీగా ఉండేలా చూడాలని, చిన్న ఇబ్బంది ఎదురైనా సమస్య తీవ్రత ఎక్కువ చూపే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటే ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీటి సరఫరా చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేయడంలో ఇబ్బందులు ఎదురైతే స్థానికంగా నీటి సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. స్థానికంగా ఉన్న నీటి వనరులు, బోరు బావులను గుర్తించడంతో పాటు మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని, ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద త్రాగునీటి సరఫరా కోసం చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



సిరిసిల్ల,తంగళ్ళపల్లి ,ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ,గంభీరావుపేట, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ ,చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట , బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల వారీగా త్రాగునీటి సరఫరా ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యామ్నాయ త్రాగునీటి సరఫరా కార్యాచరణను పూర్తిచేసే సన్నద్ధంగా ఉండాలని అన్నారు. గ్రామాలలో ఉన్న ప్రతి వార్డు, మున్సిపల్ వార్డులు, చివరి హ్యాబిటేషన్ వరకు త్రాగునీటి పరిస్థితిపై మండల ప్రత్యేక అధికారులు, మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమీషనర్లు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామం, ప్రతి బస్తి, ప్రతి మున్సిపల్ వార్డులో త్రాగునీటి సరఫరా ప్రణాళికలు రూపొందించుకోవాలని, నీటి లీకేజీలను ఎప్పటికప్పుడు నియంత్రించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. త్రాగునీటి సరఫరా హెడ్ డిస్ట్రిబ్యూటర్ ఇంట్రా స్థాయిలో నీటి లెవల్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఏదైనా సమస్య అయితే సకాలంలో స్పందించి వాటిని త్వరగా పరిష్కరించేలా చూడాలని అన్నారు. జిల్లాలో త్రాగునీటి సరఫరా కోసం స్థానిక సంస్థలు గ్రామ పంచాయతీల వద్ద అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకొని అవసరమైన పనులను వెంటనే చేపట్టాలని, స్థానిక సంస్థల పరిధిలో చేసే పనుల కోసం ఎన్నికల ప్రవర్తన నియమావళి అడ్డురాదని కలెక్టర్ తెలిపారు. అందుబాటులో ఉన్న నిధులతో చేపట్టే పనులు త్వరగా గ్రౌండ్ అయ్యే విధంగా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో ఉమా రాణి, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, మిషన్ భగీరథ ఈ ఈ లు, జానకి, విజయ్, ఆర్.డబ్ల్యూ ఎస్,పబ్లిక్ హెల్త్ ఈ.ఈలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డి.ఈ.ఈలు, డివిజనల్ పంచాయత్ అధికారులు, ఎం.పి. ఓలు, ఏ.ఈ.ఈ లు, తదితరులు పాల్గొన్నారు.



# కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాన్ని పిడమర్తి రవికి కేటాయించాలి

## - తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు అక్కెనపెల్లి కరుణాకర్ ..

**సూర్య బోయినపల్లి**



గురువారం న్యూఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ముందర మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణా రాష్ట్రంలో మాదిగల జనాభా 80 లక్షలు ఉన్నందున జనాభా దామాషా ప్రకారం మాదిగలకు కాంగ్రెస్ పార్టీ రెండు పార్లమెంటు స్థానాలు అనగా వరంగల్, పెద్దపల్లి పార్లమెంటు స్థానాలు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాన్ని కేటాయించాలని,తెలంగాణా రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా విద్యార్థులం దరిని ఏకం చేసి నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షను నేరవేర్చిన వ్యక్తి, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోరకు విద్యార్థి దశ నుండి నేటి వరకు పోరాడుతున్న వ్యక్తి, తెలంగాణా ఉద్యమంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించినటువంటి మాదిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థి ఉద్యమ కారుడు అయినటువంటి డా. పిడమర్తి రవి కి తెలంగాణ ప్రభత్వంలో అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ టికెట్ కేటాయించి ఉద్యమకారులకు న్యాయం చేయాలని ప్లకార్డులు, డప్పు చప్పుళ్లతో నిరసన తెలిపారు. వరంగల్, పెద్దపల్లి పార్లమెంటు స్థానాల గురించి కాంగ్రెస్ పార్టీ పునరాలోచన చేయాలని ఏఐసీసీ కి వినతి పత్రం అందజేసినట్లు తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు అక్కనపెల్లి కరుణాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు గుడిసె పవన్ కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ జలంధర్,భాస్కర్ ,నరేష్ ఆనందం, శ్రీనివాస్, రాజు,శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి



**సూర్య సిరిసిల్ల టౌన్**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని స్థానిక సిరిసిల్ల భవన నిర్మాణ కార్మికులకు చెల్లించే కూలి కన్నా తక్కువ కూలీకి బీహార్,యూపీ రాష్ట్రాలకు చెందిన కూలీలు పనికి వెళ్లడంతో స్థానికంగా ఉన్న కార్మికులకు ఉపాధి కరువైందని ఏటియుసి ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా లేబర్ అడ్డా వద్ద విశ్రాంతి గదులు నిర్మించాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నో దరఖాస్తులు ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందన లేదని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల యొక్క అవసరాలను తీర్చాలని అన్నారు.అదేవిధంగా కార్మికులకు హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వేలిముద్రతో కాకుండా నేరుగానే అర్హులైన కార్మికుల కు లేబర్ కార్డులను మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్ర మంలో రాజేందర్, మల్లయ్య, దేవరాజ్, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారి వెంబడి ప్లాస్టిక్ ఏరువేత

**సూర్య బోయినపల్లి**



బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో గురు వారం రోజు ప్లాస్టిక్ ఏరువేత కార్యక్రమం కార్యదర్శి మల్లేశం చేపట్టారు. గ్రామ ములోని వెళ్లే ప్రధాన రహదారుల ఇరువైపు లా చెత్త ప్లాస్టిక్ కవర్లు పేరు కపోకుండా. ప్రతి గురువారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని జిల్లా అధికారుల ఆదేశాలు రావడంతో గ్రామంలో పంచాయతీ సిబ్బందితో కార్యక్రమం చేపట్టరు. జిల్లా అధికారులు అవసరమైన చోట అదనపు కూలీలను నియమించలిని సూచించారు. సిబ్బంది అందరూ కచ్చితంగా డ్రెస్ కోడ్ ఉండాలని దీని పర్యవేక్షణ కొరకు గూగుల్ ఫార్మ్ ఇవ్వడం జరుగుతుందని జిల్లా అధికారులు ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మల్లేశం, పంచాయతీ కార్మికులు ఉన్నారు.

# బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కాంగ్రెస్ లో చేరిక

## - పార్టీ లోకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండల బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొలనూరు సింగిల్ విండో డైరెక్టర్ గరుగుల నాగిరెడ్డి తో పాటు రామన్నపేట మాజీ సర్పంచ్ దేవరాజ్ మరి కొంతమంది నాయకులు గురువారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని,ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరికలపర్వం కొనసాగుతుందన్నారు. ప్రజాసేవ కాంగ్రెస్ తోనే సాధ్యమని, బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందన్నారు. ప్రజాసేవ చేసే పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీ ఒకటేనని, కాంగ్రెస్ తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కోనరావుపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా,నాయకులు లచ్చిరెడ్డి,తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణ కోసమే షీ టీమ్స్

## - ఏఎస్సై ప్రమీల

**సూర్య కోనరావుపేట**



మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ ఎల్లవేళలా పనిచేస్తున్నాయని ,ఏవైనా సమస్యలు ఉంటే 8712656425 నంబర్ కు కాల్ చేయాలని షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల సూచించారు. గురువారం కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల తో పాటు శివంగలపల్లి పాఠశాలలో విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉండాలని అన్నారు.జిల్లాలో ఎక్కడైనా విద్యార్థినులు ఆపద వేళల్లో భయపడకుండా ధైర్యంగా 100 డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని,నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాలేజీలలో గానీ పనిచేస్తున్న చోట మహిళలు, స్టూడెంట్స్ ఆకతాయిల వలన వేధింపులకు గురైతే షీ టీమ్‌ని సంప్రదించాలన్నారు.సామాజిక మాధ్యమాల్లో, వాట్సాప్ ఫేస్బుక్ ఇంస్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, మెసేజ్‌లు ,ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ సిబ్బంది ప్రియాంక, రమాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ హయాంలో మతసామరస్యానికి పెద్దపీట

**- మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ - సిరిసిల్ల పట్టణంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చిన టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

04 సూర్య రాజన్న సిరిసిల్ల.

పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో మతసామరస్యానికి పెద్దపీట వేశామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి,సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ షాది ఖానా లో ముస్లిం సోదరులకు ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కెసిఆర్ హయాంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు గంగా, యమున తహసిల్ లాగా కలిసి మెలిసి జీవించే వాళ్ళు అన్నారు.సిరిసిల్ల నుండి ఐదు



సార్లు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మతతత్వ పార్టీలకు, అవకాశవాద పార్టీలకు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కరీంనగర్ ఎంపీగా బిఆర్ఎస్ అభ్యర్థి బోయిన్పల్లి వినోద్ కుమార్ ను పార్లమెంట్ ఎన్నికల్లో భారీ విజయంతో గెలిపించాలని ఆయన కోరారు.

**- పెళ్లిళ్ల ఫంక్షన్లతో కేటీఆర్ బిజీబిజీ**

సిరిసిల్ల పట్టణంలో పెళ్లిళ్ల ఫంక్షన్లలో పాల్గొంటూ స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ బిజీబిజీగా గడిపారు. గురువారం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన తొలుత తంగళ్ళపల్లి మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం సిరిసిల్ల పట్టణంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్ కుమారుడి వివాహానికి హాజరయ్యారు. అనంతరం పట్టణంలో జరిగిన 8 మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల శుభకార్యాలకు



హాజరై ఆశీర్వదించారు. తమ నాయకుడు శుభకార్యాలకు హాజరవ్వడం పట్ల కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. టేస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్రావు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తుల ఉమా, సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, సిరిసిల్ల పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు జిందం చక్రపాణి, జిల్లా పార్టీ అధ్యక్షులు తోట ఆగయ్య, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగరావు, గూడూరి ప్రవీణ్, బొల్లి రామ్మోహన్, లతోపాటు పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కేటీఆర్ వెంట ఉన్నారు.

## 100 రోజుల కాంగ్రెస్ పాలనలో వందలకొద్ది కష్టాలు

**- ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్**

సూర్య, వీణవంక



100 రోజుల కాంగ్రెస్ పాలనలో వందలకొద్ది కష్టాలు నెలకొన్నాయని కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఎద్దేవా చేశారు. వీణవంక మండల ంలో బుధవారం మధ్యాహ్నం పలు వివాహ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ మండల కేంద్రంలో మోటార్ వైండింగ్ షాప్ లో కాలిపోయిన మోటార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వంలో మోటర్లు కాలిపోలేదని, షాపుకు రిపేర్ కు వచ్చింది లేదని అన్నారు. కానీ నేడు ప్రతిరోజు మూడు నుంచి నాలుగు మోటర్లు కాలిపోతున్నాయని అన్నారు. కేసీఆర్ కొట్లాడి తెచ్చిన తెలంగాణలో 10 సంవత్సరాల పాటు కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఏనాటికి ఇలాంటి పరిస్థితి రాలేదని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేసీఆర్ ను, టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తెలంగాణ రైతంగం పైన ఉందని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రైతులు, ప్రజలు పొరపాటున తప్పు చేస్తే రాష్ట్రం ఆగమయ్యే పరిస్థితి ఉంటుందని అన్నారు. తెలంగాణలో రైతులు, ప్రజలు, యువత, మేధావులు ఆలోచన చేయాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమా, జడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, భానుచందర్, స్వామి, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, మర్రి స్వామి, మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**- యువకుడికి గాయాలు.**

సూర్య కాల్వ శ్రీరాంపూర్





కాల్వ శ్రీరాంపూర్ మండలం మీర్జంపెట్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తిప్పారపు ఓదెమ్మ (75) మృతి చెందింది ఓదెమ్మ మనవడు విగ్నేష్ (15) కు తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మీర్జంపేట్ గ్రామంలో సిరికొండ పోషాలు దశదినకర్మకు గుంపుల గ్రామానికి చెందిన అతని మనవడు విగ్నేష్ తో కలిసి ఓదెమ్మ హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరై తిరిగి మోటర్ బైక్ పై గుంపులకు వెళుతుండగా కిష్టంపేట్ నుండి వెనకాల వస్తున్న టి ఎస్ 22 C 5336 నెంబర్ గల కారు ఢీకొట్టడంతో ఓదెమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఓదమ్మ మనవడు విగ్నేష్ కు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి కాల్వ శ్రీరాంపూర్ ఎస్సై బి ఓంకార్ యాదవ్ చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేసి శిక్షల శాతం పెంచాలి

**-జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

సూర్య రాజన్న సిరిసిల్ల.



పిర్యాదు స్వీకరణ నుండి కేసు నమోదు, ఇన్వెస్టిగేషన్, చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి,కోర్టులలో నేరస్తుల కు శిక్షలు పడేవిధంగా క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ అధికారులకు ,సిబ్బందికి సూచించారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని రేణుక ఫంక్షన్ హాల్లో పోలీసు సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పనితీరు స్టేషన్ రిసెప్షనిస్ట్, రైటర్, టెక్ టీమ్ రైటర్స్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ లపై ఆధారపడి ఉంటుందన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన బాధితుల నుండి స్వీకరించిన పిర్యాదు మొదలు కేసు నమోదు,ఆన్లైన్లో నమోదు,ఛార్జ్ షీట్ వరకు సమన్వయం కలిగి ఉండి విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేసి కేసుల్లో శిక్షల శాతం పెంచాలన్నారు. ఫోక్సో, ఎస్సీ ఎస్టీ,గ్రేవ్, నాన్ గ్రేవ్ ,క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసుల్లో,గంజాయి మరే ఇతర మత్తు పదార్థాల కేసులలో పక్కా ప్రొసీజర్ ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి త్వరగతిన కోర్టులలో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని సూచించారు. ప్రతి కేసులో సమగ్ర విచారణ చేపట్టి భాదితులకు న్యాయం చేకూరేలా పని చేయాలని,ప్రతి కేసు విచారణలో ప్లాన్ ఆఫ్ యాక్షన్ చేసుకొని పకడ్బదీగా విచారణ చేపట్టి నిందుతులకి శిక్షలు పడేలా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య,సి.ఐ లు రఘుపతి, సదన్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ సి.ఐ అనిల్ కుమార్, డీసీఆర్బీ సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ లు,రిసేపనిస్ట్ లు,రైటర్స్, టెక్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోషణ్ పక్వాడాలో ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస పత్రాలు

సూర్య కరీంనగర్ ప్రతినిధి



మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుండి 23 వరకు నిర్వహించిన పోషణ్ పక్షోత్సవాల నిర్వహణలో కరీంనగర్ జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పోషణ్ అభియాన్ కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రశంసా పత్రాలు అందజేశారు. పోషణ్ అభియాన్ కార్యక్రమాల్లో ఉత్తమ సేవలు అందించిన జిల్లా కో ఆర్డినేటర్ ఇ.నాగరాజు, ప్రాజెక్టు అసిస్టెంట్ జి.రౌమీల, హుజురాబాద్ సిడిపిఓ తిరుపతమ్మ, సూపర్వైజర్ శిరీష, బ్లాక్ కో ఆర్డినేటర్ కె.నాగరాజు, అంగన్వాడీ టీచర్ కరుణ ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి మాట్లాడుతూ పోషణ్ పక్వాడ 2024 కార్యక్రమాల నిర్వహణలో కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇందుకు కృషి చేసిన సిడిపిఓలు, సూపర్వైజర్లు, డి.పి.ఏలు, అంగన్వాడీ టీచర్లను అభినందించారు.

## ఇద్దరు కానిస్టేబుల్ లు సస్పెన్షన్

సూర్య మల్లాపూర్

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ సురేష్, ధనుంజయ్ లపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 17తేదిన పోలీస్ స్టేషన్ లో మద్యం సేవించారని వచ్చిన ఆరోపణల మేరకు పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఇద్దరు కానిస్టేబుల్ లను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

## గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

సూర్య తిమ్మాపూర్



తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ASSAR పెట్రోల్ బంకు ఖాళీ స్థలంలో గురువారం ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి శవం లభ్యమైందని ఎల్ఎండి ఎస్ఐ చేరాలు తెలిపారు. మృతుని వయస్సు అందాజు 40-45 మధ్యన కలిగి ఉన్నాడని తెలిపారు. దాదాపు 15 రోజుల నుండి కొత్తపల్లి గ్రామములో మానసిక స్థితి బాగా లేక జాతీయ రహదారిపై తిరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎండాకాలం అయినందున డీహైడ్రేషన్ వలన చనిపోయినట్లు కొత్తపల్లి పంచాయితీ సెక్రెటరీ అరుణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని గుర్తించుటకు కరీంనగర్ మార్చురీ నందు భద్రపరిచారు.ఎవరైన ఇట్టి వ్యక్తిని గుర్తించినచో ఎల్ఎండి ఎస్ఐ సెల్ నంబర్ 8712670770, సిఐ సెల్ నంబర్ 87126 70731 లకు సంప్రదించగలరు.

# తాగునీటికి ఇబ్బందులు రానివ్వకండి

**- మొక్కల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోండి - జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

సూర్య కరీంనగర్ ప్రతినిధి

గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తి గ్రామంలో ఎస్డీఎఫ్ నిధులతో కొత్తగా వేసిన తాగునీటి బోర్ వెల్, ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. బోరు ఎన్ని ఫీట్లు వేశారు.. గ్రామంలో ఎన్ని ట్యాంకులు ఉన్నాయి.. వాటి సామర్థ్యం ఎంత..ఎక్కడి నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు.. అని అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే యుద్ధ ప్రాతిపదికన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని పేర్కొన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పనులను త్వరగా



పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మార్చి 31 లోపు పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని, లేకపోతే నిధులు ల్యాప్స్ అయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ అంశానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం ఇదే గ్రామంలో నర్సరీని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకానికి తీసుకుంటున్న చర్యలు.. ఏమేం మొక్కలు ఎక్కువగా పెంచుతు న్నారని సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే పూల మొక్కలు, బెండ తోటను పరిశీలించారు. చాలా చక్కగా పెంచుతున్నారని సిబ్బందిని అభినందించారు. వేసవి నేపథ్యంలో మొక్కలు వాడిపోకుండా ఎప్పటికప్పుడు నీటిని అందించాలని కలెక్టర్ సూచించారు. మొక్కల సంరక్షణ పైనే ప్రత్యేక దృష్టి సారించాలని, హరితహారానికి అన్ని మొక్కలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూలీల హాజరు.. ఏమేం పనులు చేపట్టారని తెలుసుకున్నారు. వేసవి కాలం నేపథ్యంలో ఉదయం పూటనే కూలీలతో పనులు చేయించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఆర్ డబ్ల్యూఎస్ డీఈ సూర్య ప్రకాశ్, మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ ప్రభాకర్, ఎంపీఓ జగన్మోహన్ రెడ్డి, ఆర్ఐ వాస్తవిక్, పీఆర్ ఏఈ రమణారెడ్డి, పలువురు అధికారు లు, తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి

**– అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**సూర్య రాజన్న సిరిసిల్ల.**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. రబీ సీజన్ (2023–24) ధాన్యం కొనుగోళ్లపై జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,లోక్ సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను అధికారులు, ఆయా శాఖల బాధ్యులు మాత్రమే ప్రారంభించాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు. నిర్దేశించిన బరువుకంటే ఎక్కువ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దని ఆయన స్పష్టం చేశారు.



**-మద్దతు ధరకే విక్రయించాలి**

రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పిలుపు నిచ్చారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని,నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 2203, గ్రేడ్ బీ రకానికి రూ. 2183 నిర్ణయించినందని వెల్లడించారు. నిబంధనల మేరకు రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని సూచించారు.



**-ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం**

రబీ సీజన్ కోతలు మొదలైన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 13 మండలాల్లో ఏప్రిల్ 1 వ తేదీన ఒక్కో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో ఈ రబీ సీజన్లో దాదాపు 3 లక్షల నుంచి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వెల్లడించారు. ధాన్యాన్ని సేకరించేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 201, ఐకేపీ ఆధ్వర్యంలో 44, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 10, మెప్మా ఆధ్వర్యంలో4 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు వివరించారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు అన్ని కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అవసరం అయితే ఇంకా కేంద్రాలు ఎక్కువ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రైతులకు టోకెన్లు ఇవ్వాలని, దాని ప్రకారం కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఈ సారి ఐరిస్ యంత్రా లు కూడా పంపిస్తామని, ధాన్యం కొనుగోలు చేసినప్పుడు రైతు ఐరిస్ కూడా తీసుకోవాలని సూచించారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు కేటాయిం చిన రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని, రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు కొనుగోళ్లు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**-అందుబాటులో పరికరాలు**

జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ వెల్లడించారు. టార్పాలిన్లు 8454, తూకం వేసే యంత్రాలు 265, ప్యాడీ క్లీనర్లు 613, తేమ శాతం చూసే మెషిన్లు 570 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో డీసీఎస్ఓ జితేందర్ రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీఎంఓ ప్రవీణ్ రెడ్డి, డీఆర్డీఓ శేషాద్రి, డీటీఓ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## జీవన్ రెడ్డిని సన్మానించిన జువ్వాడి

**సూర్య -కోరుట్ల**



పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి నీనిజామాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు జగిత్యాల లో గురువారం జీవన్ రెడ్డి స్వగృహం ఇందిరా భవన్లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి, పూల బొకేలు అందజేశారు .ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావుతోపాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలేటి మహిపాల్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ వివిధ హెూదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద పెల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని సన్మానించిన జువ్వాడి

**సూర్య -కోరుట్ల టౌన్**



పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కృష్ణారావు ఆయనకు పూలమాలవేసి శాలువా ల తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం ,పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నయీమ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, నాయకులు మ్యాకల నర్సయ్య ,నేమూరి భూమయ్య ,కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

**సూర్య ఎండపల్లి**



మండలం లోనికొండాపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల మురళి కుమారుని వివాహానీకి గురువారం ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశి, పీసీసీ సభ్యుడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి , గాజుల విజయ్ ,సోమిశెట్టి రమేష్, గిల్లి శ్రీనివాస్ మన్నే జితేందర్ వెంకటస్వామి వడకపురం రవి, శ్రీనివాస్ పవన్ బుచ్చయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా శ్రీనివాసరావు

**సూర్య -కోరుట్ల**



కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా తన్నీరు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. గురువారం కోరుట్ల సివిల్ జడ్జ్ కోర్టులో జరిగిన ఎన్నికలలో అధ్యక్షునిగా శ్రీనివాసరావు గెలుపొందారు. ఉపాధ్యక్షునిగా తోట ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా సుతారి శ్రీనివాసరెడ్డి, రాచకొండ రోజా, సహాయ కార్యదర్శిగా చిలువేరి రాజశేఖర్ ఎన్నికయినట్లు ఎన్నికల అధికారులు మచ్చ మచ్చ వెంకటరమణామూర్తి, చిన్న విశ్వనాథములు తెలిపారు.

## రైతుల శ్రేయస్సే సహకార సంఘం లక్ష్యం

**- సింగిల్ విండో చైర్మన్ మల్లారెడ్డి.**

**సూర్య,రాయికల్2**



రైతుల శ్రేయస్సే సహకార సంఘం లక్ష్యం అని రాయికల్ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి అన్నారు. రాయికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 01.04.2023 నుండి 25.03.2024 వరకు జమ,ఖర్చుల వివరాలు సమర్పించడం జరిగింది.ఈ సమావేశంలో చైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి మాట్లాడుతూ 2022-23 సం. నికి గాను 10% డివిడెండ్ సభ్యుల ఖాతా జమ చేయడం జరిగింది అని తెలిపారు.అలాగే సహకార సంఘం లో సభ్యత్వం తీసుకుని, ఇటీవల మరణించిన ముగ్గురు సంఘ సభ్యులకు మరణించినందుకు దహన సంస్కారాల నిమిత్తం ఒక్కరికి 10,000 రూపాయల చొప్పున 30,000 అందజేశారు.ఈ కార్యక్రమంలో కేడిసిసి బ్యాంక్ మేనేజర్ మార్కండేయ,పాక్స్ వైస్ చైర్మన్ బేతి మోహన్ రెడ్డి, డైరెక్టర్స్ కుర్మ రాము,కొల్ల నారాయణ, పాలడుగు నరహింహ రెడ్డి,గుండ నరేష్,భేతి లక్ష్మి,,మండల వసంత,భూమరాజం,సీఈఓ ఎలిగిటి రవికుమార్, అసిస్టెంట్ సీఈఓ జగదీష్,సంఘ సిబ్బంది, రైతులు తదితులు పాల్గొన్నారు.

## వాసవి అన్నదాన సత్ర భవన శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

**- ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాటికొండ పవన్**

**సూర్య వేములవాడ టౌన్**



శ్రీ రాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి అన్నపూర్ణ నిత్య అన్నదాన సత్ర భవన శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాటికొండ పవన్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ట్రస్ట్ కార్యాలయం ఆవరణలో 9 ఆర్యవైశ్య అభ్యుదయ సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంపి పీఠాధిపతి శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి అలాగే తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ , స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ట్రస్ట్ భవనంతో పాటు శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం వాసవి కన్యకా పరమేశ్వరి మాత దేవాలయాలకు కూడా శంకుస్థాపన చేస్తున్నట్లు వారు తెలిపారు. వేములవాడ పట్టణ ప్రజలతో పాటు పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యులు కార్యక్రమానికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, నగుబోతు రవీందర్, దువ్వ శ్రీనివాస్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రేనికింది అశోక్, కటకం సత్యనారాయణ ,వంగల మహేష్ , ఆమెటి శ్రీనివాస్, మద్య సత్యనారాయణ, బచ్చు వెంకటేశం, కొత్త అనిల్, దైత సతీష్, ఎర్ర మణికంఠ, పైడి కృష్ణ, ఏగిన రమేష్, వంగల కిరణ్ , గజవాడ శ్రీనివాస్, మాడిశెట్టి మహేష్, ఎర్ర శ్రీనివాస్, యాదవ్, మంచాల రాజశేఖర్, బొడ్ల ప్రసాద్, గందె నాగరాజు, వేణు, గంప శంకర్, రాంప్రసాద్, మోటూరి శ్రీనివాస్, ఎర్ర అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

**సూర్య, రాయికల్**

రాయికల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు గురువారం జరిగింది. ఇట్టి నియామకాలను అధ్యక్షులు కూరగాయల రవి ప్రకటించారు. ప్రధాన కార్యదర్శి గా గరిపెల్లీ శ్రీనివాస్,కోశాధికారిగా పల్లెర్ల పవన్,ఉపాధ్యక్షులుగా అయితే శేఖర్,సిర్ప సంతోష్,బోలుసాని ఆంజనేయులు,అయిత నవీన్,జాయింట్ సెక్రెటరీగా సిద్ధం శెట్టి మహేష్, కూరగాయల అశోక్,రంజిత్,కటకం కళ్యాణ్, పిఆర్వోలుగా నాగమల్లి శ్రీకర్,నరం శెట్టి మనోజ్ నియమించినట్లు అధ్యక్షులు కూరగాయల రవి తెలిపారు.

## పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**సూర్య -కోరుట్ల**



పశు వైద్య పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో నడుస్తున్నటువంటి గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా బుధవారం కోరుట్ల మండలం చిన్న మెట్పల్లి గ్రామంలో 260 గేదెలకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు .ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన నియోజకవర్గపు మానిటరింగ్ అధికారి అసిస్టెంట్ డైరెక్టర్ జి బక్కయ్య రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పాడి గేదెలకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకొని కాపాడుకునే బాధ్యత రైతులపై ఉందని అన్నారు.గాలికుంటు వ్యాధి (ఎఫ్ ఎం డి) పశువుల యందు ప్రాణాంతకమైన వైరస్ వ్యాధి సూక్ష్మతి సూక్ష్మజీవుల వలన గాలితో ఈ వ్యాధి పశువుల యందు వ్యాప్తి చెంది అధిక జ్వరంతోపాటు కాలు డెక్కల మధ్యన పుండ్లు ఏర్పడి నోటిలో పుండ్లు ఏర్పడి అధిక సొంగ కారుతూ నిరసించి పశువు చనిపోయే అవకాశాలు అధిక శాతం ఉన్నాయి అని దీంతోపాల ఉత్పత్తి తగ్గి పాడి రైతులు పాల దిగ బడిలో నష్టపోయే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు తప్పనిసరిగా టీకాలు ఇప్పించుకొని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్ పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దాడికి గురయిన హిందూ కుటుంబాలకు న్యాయం జరగాలి

**సూర్య బోయినపల్లి**

హెూళీ పండగ సంధర్భంగా మేడ్చల్ జిల్లా బోడుప్పల్ కార్పోరేషన్ పరిధిలోని చెంగిచర్ల లో స్థానికంగా ఉండే గిరిజనులు హెూళీ పండుగను జరుపుకుంటుండగా మసీదుల నుండి వచ్చిన కొంతమంది ముస్లిం మతోన్మాద గుండాలు గుంపుగా చేరి హెూళీ సంబరాలు జరుపుకుంటున్న హిందూ మహిళలపై , స్థానికంగా నివసిస్తున్న సుమారు 25 పేద హిందూ కుటుంబాలపై విచక్షణరహితంగా దాడి చేయడం జరిగింది , ఈ సంధర్భంగా అక్కడున్న పోలీసు యంత్రాంగం దాడి చేసిన వారిపై ఎలాంటి చర్యలను తీసుకోకపోవడమే కాకుండా తిరిగి దాడికి గురయ్యిన భాధితులపై కేసులను నమోదు చేయడాన్ని ఖండిస్తూ , అలాంటి మతోన్మాద శక్తులకు కొమ్ముకాస్తు గంపగుత్త ఓట్లకోసం భాధితులకు అండగా నిలబడాల్సింది పోయి మైనార్టీ సంతూష్టీకరణ కోసం ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఒక దుర్మార్గపు ఆలోచనలకు తెరతీస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం చోధ్యం చూస్తూ ఘటన జరిగి 48 గంటలు కావస్తున్న దాడి చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని భారతీయ జనతా యువమోర్చా పక్షాన ఖండిస్తున్నామని బోయినిపల్లి మండల కేంద్రంలో జరిగిన పత్రిక సమావేశం లో రాజన్న సిరిసిల్లా యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు



చెన్నాడి రాజిరెడ్డి తెలిపారు . ఈ సంధర్భంగా స్థానికంగా ఉండే 40 డబుల్ బెడ్రూం ఇళ్లలను ఎలాంటి నీడలేని గుడిసెల్లో నివసించే 25 కుటుంబాలలోని పేదలకు కేటాయించకుండా కేవలం 6 కుటుంబాలుగా ఉన్న ముస్లిం కుటుంబాలకు కేటాయించడం ఎక్కడ న్యాయమని తీవ్రంగా గాయపడిన స్త్రీలను కూడా ఆసుపత్రిలో చేర్చుకోలేక ప్రథమ చికిత్స మాత్రమే అందించి పంపించడం చివరకు బిజెపి రాష్ట్రాధ్యక్షులు కిషన్ రెడ్డి చొరవతో భాధిత మహిళలను గాంధీ ఆసుపత్రికి తరలించారంటే రాష్ట్ర ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యం తారాస్థాయికి చేరిందని ప్రజలు గమనించాలన్నారు. హెూం శాఖను వారి దగ్గరే అంటిపెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని సెక్యులర్ అన్న పదం కేవలం మాటల వరకు పరిమితం చేస్తూ ఒక వర్గానికి కొమ్ము కాయడాన్ని తెలంగాణ రాష్ట్రంలోని హిందూ సమాజం గమనిస్తున్నదని ఈ సంధర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ దాష్టీకంపై పెదవి విప్పి భాధితులకు అండగా నిలవాలన్నారు.తరచూ ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ మహిళలపై దాడులు జరిగితే దాడికి పాల్పడ్డ వారికి కొమ్ముకాయడమేన ఇందిరమ్మ రాజ్యమ. భాధితులకు అండగా మేము న్నామని బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ భాధిత కుటుంబాలను పరామర్శిం చడానికి వెళ్లినప్పుడు పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించ డంతో పాటు బిజెపి నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని చూస్తుంటే ఈ రాష్ట్రంలో రజాకర్ల పాలన ముగిసి బెకారుల పాలన వచ్చినట్టు కనిపిస్తుందని దుయ్యబట్టారు . ఘటన జరిగిన సమయంలో అక్కడున్న సి.ఐ ,ఎస్సై ల నిర్లక్ష్యంపై వారిపై చర్యలు తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైన మొద్దు నిద్రవీడి భాధిత కుటుంబాలకు న్యాయం చేసి భవిష్యత్తులో మరి ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో బిజెవైయం నాయకులు కొమటిరెడ్డి రాం మోహన్ రెడ్డి, బుర్ర మహేష్ గౌడ్ , అన్నాడి కమలాకర్ రెడ్డి , స్థానిక బూత్ అధ్యక్షులు మళ్లబోయిన రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు .

# ప్రభుత్వ చీఫ్ విప్ ను కలిసిన కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సిసిఆర్) సంస్థ సభ్యులు

**- ప్రజా సమస్యలపై పోరాడుతున్న కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ విజ్ఞప్తిని పరిగణంలోకి తీసుకోవాలని విజ్ఞప్తి**

**సూర్య వేములవాడ టౌన్**

సమాచార కమిషనర్ గా సిసిఆర్ ఫౌండర్ అండ్ చైర్మన్ మంచి కట్ల అనిల్ కుమార్ ని సిఫారసు చేసిన కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ పౌర మరియు మానవ హక్కుల సంస్థ ఉన్నత వ్యక్తిత్వం గల వ్యక్తిని నియమిస్తే ఉన్నత ఫలితాలు వస్తాయని వెల్లడి. వివరాల్లోకి వెళితే కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ పౌర మరియు మానవ హక్కుల సంస్థ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ఆదే శ్రీనివాస్ ని వేములవాడలోని క్యాంపు కార్యాలయంలో సిసిఆర్ సభ్యులు మరియు ఫైండర్, కో- ఫౌండర్స్, రెండు తెలుగు రాష్ట్రాల కార్యదర్శిలు కలసి తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న తెలంగాణ సమాచార కమిషనర్ నియామకాన్ని త్వరగా చేపట్టాలని వినతి పత్రాన్ని సమర్పించారు. ఇందులో భాగంగా సమాచార కమిషనర్ పదవికి అర్హులైన విద్యావంతున్ని సామాజిక సేవ దృక్పథం



తలవారిని నియమించాలని తద్వారా ప్రజల సమస్యలను కోర్టు వరకు వెళ్లకుండా నివారించవచ్చని వివరించారు. పూర్తి అర్హతలు కలిగిన వ్యక్తిగా సమాచార కమిషనర్ గా మంచి కట్ల అనిల్ కుమార్ ని నిర్మించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికలు ముగిసిన వెంటనే కమిషనర్ నియామకం జరుగుతుందని ఇట్టి విషయాన్ని క్యాబినెట్ సమావేశంలో చర్చించామని అన్నారు. సమాచార కమిషనర్ నియామకంలో సిసిఆర్ సంస్థ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు మరియు చైర్మన్ మంచి కట్ల అనిల్ కుమార్, కో- ఫౌండర్ ఇల్లెందుల స్వామి, కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్ ని వైస్, భూక్యా చరణ్ కారంత్, తెలంగాణ సెక్రటరీ గుండ్ల శివరాత్రి, జోనల్ సెక్రెటరీ ఎస్ రత్న ఫకర్, కరీంనగర్ ఐడి కార్డ్ ఇంచార్జ సత్యనారాయణ్, రికార్డ్ ఇన్స్ట్రక్షన్ వింగ్ చంద్రకాంత, సభ్యులు సత్యనారాయణ జహం గీరు, జి ప్రకాష్, తాలూకా మల్లేశం, బి సత్యనారా యణ్, జె న రమేష్, సయ్యద్ సలీంశంకర్, జే రవీంద్ర, మిషన్ ఎడ్యుకేషన్ వింగ్ కే ఐలయ్య తోపాటు రాజన్న సిరిసిల్లలో, కరీం నగర్, సిద్ధం పేట, జగిత్యాల మరియు చుట్టుపక్కల ఉన్న ఎనిమిది జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

# భ్రూణ హత్యలను పూర్తి స్థాయిలో అరికట్టాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ**

**సూర్య-గోదావరిఖని:**

సమాజంలో భ్రూణ హత్యలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు వైద్య శాఖకు సంబంధించిన అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఇక్కడి ఎన్టీపీసీ మిలీనియం హాల్ లో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావ్, బేటి పడావో కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లకు, ఆశ వర్కర్లకు, వైద్య అధికారులకు పిసిపి ఎన్ డిటి యాక్ట్ పై నిర్వహించిన వర్క్ షాప్ లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణశ్రీ సమాజంలో లింగవివక్షతకు వ్యతిరేకంగా జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అమ్మ కడుపు నుండే వివక్షతకు గురవడం దారుణమని, సమాజంలో ప్రతి ఒక్కరూ లింగ వివక్షతకు వ్యతిరేకంగా కృషి చేయాలని కోరారు. భ్రూణ హత్యల కారణంగా



స్త్రీల సంఖ్య వేగంగా పడిపోతుందని, భ్రూణ హత్యల నివారణకు ప్రభుత్వం 1994 లో పీసీ పిఎన్ డీటీ యాక్ట్ తీసుకోచ్చిందని , దీని ప్రకారం లింగ నిర్ధారణ చేసినా, గర్భ స్రావాలు చేయించిన ఇరువర్గాలు శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. మొదటిసారి తప్పుకు 3 సంవత్సరాల జైలు, రూ.10వేలు జరిమానా, రెండవ సారి తప్పు చేస్తే 5 సంవత్సరాల జైలు, రూ.50 వేలు జరిమాన విధించే అవకాశం ఉందని అన్నారు. అమ్మ కడుపులో ఉన్న ఆడపిల్లలను సంరక్షించాలని, పురుషులతో సమానంగా మహిళలను సైతం పెంచేలా అవగాహన కల్పించాలని, ప్రతి ఆడపిల్లకు తప్పనిసరిగా విద్య అందించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. మానసిక ఒత్తిడికి లోనైన వారి సహాయార్థం ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసిందని, మానసికంగా ఆందోళన చెందుతున్న వ్యక్తులు 144617 నెంబర్ ఫోన్ చేస్తే వారికి సరైన కౌన్సిలింగ్ సలహాలు అందించి వారిని సంరక్షించే అవకాశం ఉంటుందని తెలిపారు. పిల్లల సంరక్షణ, పునరావాసం కోసం 1098, వృధ్ధులకు సేవలు అందించడం కోసం 1456, దివ్యాంగుల కోసం 11326, స్వీప్ ప్రోగ్రామ్ కోసం 1950, సైబర్ క్రైమ్ బాధితుల కోసం 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేస్తే ఆ సమస్య పరిష్కారం అవుతుందని ఈ నెంబర్లను ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మహిళ సాధికారత కోఆర్డినేటర్ దయ అరుణ, డిప్యూటి డిఅండ్ఎంహెచ్ఓ కృపా బాయ్, డిసిపివో ఫర్విన్ , పెద్దపల్లి సిడిపివో కవిత, రామగుండం సిడిపివో జి.స్వరూప రాణి తదితరులతో పాటు మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# జగిత్యాల బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షునిగా డబ్బు లక్ష్మారెడ్డి రెండు ఓట్ల స్వల్ప మెజారిటీతో ఎన్నికల ప్రత్యర్థి రాచకొండ శ్రీరాములు పై విజయం సాధించారు. వైస్ ప్రెసిడెంట్ గా పి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా భూమి రమణకుమార్, సెక్రటరీగా జున్ను రాజేందర్, లైబ్రరీ సెక్రెటరీగా భద్రి రమేష్, కోశాధికారిగా హరిదాస్, స్పోర్ట్స్ సెక్రటరీగా గంగరాజం, జూనియర్ ఇ సి మెంబర్లను ఎన్నుకోవడం జరిగింది. నూతన కార్యవర్గానికి సీనియర్, జూనియర్ న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్ దాసరి సునీత- రాజశేఖర్

**సూర్య -కోరుట్ల టౌన్**



కోరుట్ల పట్టణ 11వ వార్డు కౌన్సిలర్ దాసరి సునీత- రాజ శేఖర్ లు కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి జువ్వాడి నర్సింగరావు ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం ,ఉపాధ్యక్షులు నయీమ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిన్పల్లి సత్యం రావు, కౌన్సిలర్ ఎంబెరి నాగభూషణం, నాయకులు ఎంబెరి సత్యనారాయణ, మ్యాకల నర్సయ్య ,ఆడెపు మధు ,శీలం వేణుగోపాల్, సోగ్రాభి ,నేమూరీ భూమయ్య, రంజిత్ , పాల్గొన్నారు.

# అక్రమ టేకు కలప పట్టివేత

**సూర్య మల్లాపూర్**

మండలంలోని గొర్రెపల్లి గ్రామంలో అక్రమంగా టేకు కలప నిల్వ చేసారనే విశ్వసనీయ సమాచారం మేరకు. ఫారెస్ట్ రేంజ్ అధికారి భూమేష్ ఆదేశానుసారం డిప్యూటి రెంజ్ అధికారి చంద్రమౌళి, బీట్ అధికారి సత్తర్ లు కలప నిల్వ వుంచిన ప్రాంతంలో ఆకస్మిక దాడులు చేసారు. సుమారు లక్ష యాభై వేల విలువ గల కలపను ఘటన స్థలంలో స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్ లో చేరిన బిజెపి నేతలు

**సూర్య జమ్మికుంట**



జమ్మికుంట మండలానికి చెందిన పలువురు బిజెపి నేతలు గురువా రం కాంగ్రెస్ పార్టీలో చేరారు హుజురాబాదు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ ఒడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జమ్మికుంట మండల బిజెపి నాయకులు దొగ్గల భాస్కర్ పుల్లూరు సంపత్ కనకం కుమార్ రెంటాల కిరణ్ కొల్లూరు మురళి నిశాంత్ రాజు బోయిని వాసు రాజేందర్ బాబు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరడమైనది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు పుల్లూరు సదానందం తదితరులు పాల్గొన్నారు

# ఏప్రిల్ 6 వరకు ఐఈసి మెటీరియల్ టెండర్ సమర్పించాలి

**- అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

ఏప్రిల్ 6 వరకు బేటి బచావో బేటి పడావో ఐఈసి మెటీరియల్ కొరకు టెండర్ సమర్పణ గడువు ఉందని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పెద్దపల్లి జిల్లా పరిధిలోని మహిళా సాధికారత కేంద్రంలో ఐఈసి మెటీరియల్ సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తిగల టెండర్ దారులు టెండర్ లో పాల్గొనుటకు టెండర్ షెడ్యూల్ ను ఖరీదు వెయ్యి రూపాయలను (District Welfare Officer, WCD & Sc, Peddapalli) పేరు మీద డిడి/బ్యాంకు చెక్కు ద్వారా చెల్లించి ఏప్రిల్ 6 వరకు సాయంత్రం 3 గంటలలోపు పొందాలని తెలిపారు. ఏప్రిల్ 6 సాయంత్రం 5 గంటల్లోపు సీల్డ్ టెండర్ సమర్పించడానికి గడువు ఉందని, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సీల్డ్ టెండర్లు సమర్పించాలని మిగిలిన వివరాలకు కార్యాలయపు పనివేళల్లో 7382452944 ఫోన్ నెంబర్ నందు సమర్పించాలని, ఇట్టి టెండర్ రద్దు మార్పులు చేయి పూర్తి అధికారం కమిటీ చైర్మన్ కు ఉంటుందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

**- గంజాయి సేవించిన,అమ్మిన కఠిన చర్యలు తప్పవు - డి.ఎస్.పి రఘు చందర్.**

**సూర్య,రాయికల్**

అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న యువకులను అరెస్టు చేసి, రిమాండ్ కు తరలిస్తున్నట్లు జగిత్యాల డిఎస్పి రఘు చందర్ తెలిపారు. రాయికల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం 4 గంటలకు జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ పర్యవేక్షణ లో రూరల్ సిఐ ఆరిఫ్ అలీ ఖాన్,రాయికల్ ఎస్సై అజయ్ వారి సిబ్బంది రాయికల్ శివారు లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు స్కూటీ పైన రాయికల్ వైపు జగిత్యాల నుండి వస్తుండగా, కుమ్మరిపల్లి బస్టాండ్ వద్ద వారిని పట్టుకొని విచారించగా వారి వద్ద గల సంచి లో 1.5 కిలోల ఎండు గంజాయి,నిందుతుల వద్ద నుండి సెల్ ఫోన్ లు స్కూటీ ని స్వాధీన పరచుకొని విచారించగా, వారు చేసిన నేరం ఒప్పుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితుల నుండి 1.5 కిలోల ఎండు గంజాయి,ఒక బైక్,మూడు సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నట్లు డి.ఎస్.పి తెలిపారు. జగిత్యాల పట్టణంలోని ఆర్.ఎన్.టి నగర్ కు చెందిన కొండూరి రాజేష్



డ్రైవర్ గా పనిచేస్తూ, గంజాయి సరఫరా చేస్తుండే వాడని,ఇదే నేపథ్యంలో జగిత్యాల రూరల్, మల్యాల, వరంగల్ జిల్లా నెక్కొండ పోలీస్ స్టేషన్ లలో గంజాయి కేసులు ఉన్నాయన్నారు అలాగే మరో నింది తుడు అరుముల్ల సాయి కుమార్ జగిత్యాల్ లోనీ బీట్ బజార్ కు చెందిన వాడని,ఇతని మీద వరంగల్ జిల్లా నెక్కొండ లో గంజాయి కేసు, జగిత్యాల టౌన్ లో బండి దొంగతనం కేసులు నమోదయ్యాయి అని ఆయన అన్నారు.నేర ప్రవృత్తి కలిగిన ఇట్టి యువకులు సిసిఎల్ ఇటీవల రాయికల్ గంజాయి కేసులో రిమాండు అయిన పెనుగొండ గణేష్, మలవాత్ సతీష్ మరియు జగిత్యాల పట్టణానికి చెందిన కొండూరి రాజేష్,అరుముల్ల సాయి కుమార్ మరియు మరి కొంత మంది వ్యక్తులు ఒక గ్రూపు గా ఏర్పడి, మైనర్ దగ్గరికి వెళ్లి తక్కువ ధర కు గంజాయి ని కొనుక్కొని,జగిత్యాల జిల్లా కు తీసుకు వచ్చి, ఇక్కడ అమాయక యువత కు ఎక్కువ ధర కు అమ్ముతున్నారు.వీరు అందరూ గత 2 నుండి 3 సం . ల లో చాలా సార్లు మైనర్ బాలునీ దగ్గర తక్కువ ధర కు గంజాయి ని కొనుక్కొని వచ్చారు. మైనర్ బాలుడు జగిత్యాల కి తీసుకు వచ్చి గంజాయి ని అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయని,ఈ నెల 25 న తన ప్రాంతం నుండి జగిత్యాల కి బయలు దేరాడు. అతను జగిత్యాల కి వచ్చి తన పాత మిత్రులు అయిన రాజేష్ మరియు సాయి కుమార్ లను కలుసుకుని, గురువారం రాజేష్ యొక్క బండి మీద రాయికల్ లో ఎవరైనా వ్యక్తులకు అమ్ముదాం అని ముగ్గురు రాయికల్ బయలుదేరగా,వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసు వారు నిందితులను మరియ మైనర్ ను పట్టుకున్నారు.ఇట్టి కేసులో గంజాయి కొనుగోలు మరియు సరఫరా చేసిన వ్యక్తుల గురించి దర్యాప్తు జరుగుతుందని డి.ఎస్.పి పేర్కొన్నారు. ఇట్టి గంజాయి అక్రమ రవాణా చేస్తూ మరియు అమ్ముతున్న నిందితులను చాక చక్యంగా పట్టుకున్న రూరల్ సిఐ,రాయికల్ ఎస్సై, కానిస్టేబుల్స్ సాగర్, ప్రశాంత్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పడాల శ్రీరాములు

**సూర్య - సుల్తానాబాద్**



సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలను గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. హెూరాహెూరీగా జరిగిన ఎన్నికలలో 43 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగంచుకున్నారు. అధ్యక్ష స్థానానికి ఆలూరి శ్రీనివాసరావు, పడాల శ్రీరాములు పోటీపడగా పడాల శ్రీరాములు కు 29 ఓట్లతో అధ్యక్షుడు గా విజయం సాధించారు. అలాగే ప్రధాన కార్యదర్శి పదవికి బోయిని భూమయ్య, జోగుల రమేష్, వేపూరి తిరుపతి లు పోటీ పడగా జోగుల రమేష్ 23 ఓట్లతో గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా పెగడ శ్యాం సుందర్, సంయుక్త కార్యదర్శిగా సామల రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా చీకటి సంతోష్ కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా వడ్లకొండ రవికిరణ్, లైబ్రరీ కార్యదర్శిగా అవుల శివ కృష్ణ, మహిళా ప్రతినిధి గా పి. సంధ్యారాణి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా లక్ష్మీరాజం, బాలకిషన్ ప్రసాద్, పబ్బతి లక్ష్మీకాంత్ రెడ్డి, అకారపు సరొత్తంరెడ్డి, వోడ్నాల రవీందర్, అవునూరి సత్యనారాయణ జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మల్యాల కరుణాకర్, తాళ్ళపల్లి లక్ష్మణ్, అరెల్లి రాములు, వంగల యుగంధర్ రెడ్డి, గుడ్ల వెంకటేష్ లను ఎన్నుకున్నారు. పడాల అంజయ్య, రుద్రారపు నర్సయ్య ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు.

## మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన టెక్నికల్ వర్క్ షాప్

**సూర్య-పెద్దపల్లి రూరల్**



తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ వారి ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల టెక్నికల్ వర్క్ షాప్ ముగిసినది. ప్రోగ్రామింగ్ ఎసెన్షియల్ ఇన్ పైతాన్, జాంగో అను అంశంపై రిసోర్స్ పర్సన్ రత్న ప్రియ విద్యార్థుల యొక్క సందేహాలు నివృత్తి చేసి నైపుణ్యాన్ని మెరుగుపరిచారు. కళాశాల చైర్మన్ ఎడవెల్లి నవీన్, డైరెక్టర్ ఏ. నవత టాస్క్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి .శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు టెక్నికల్ వర్క్ షాపులకు ఎక్కువగా హాజరు అవ్వడం వల్ల వారి యొక్క నైపుణ్యాలు మెరుగుపడి ఉద్యోగ సాధనలో మెరుగైన అవకాశాలు పొందవచ్చునని పేర్కొన్నారు. ఇందులో భాగంగా కళాశాల అకౌంట్స్ ఆఫీసర్ పి. పవన్ కుమార్, ప్లేస్మెంట్ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్లు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరెకటిక కులస్తుల స్మశాన వాటిక స్థలము ఎక్కడ

**- దహన సంస్కారాలకు చెరువే గతి**

**- మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చి మరిచారు**

**సూర్య కోరుట్ల రూరల్**



మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ఆరెకటిక కులస్తుల దహన సంస్కారాలు చేయడానికి స్మశాన వాటిక స్థలము లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆరెకటికె కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర రావు కు గతంలో స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతిపత్రం సమర్పించినట్లు కుల సభ్యులు తెలిపారు. గతంలో ఎన్నికల సమయంలో బి ఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆరెకటిక కులస్తులకు స్మశానికి వాటిక స్థలాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చి మరిఛారని గుర్తు చేశారు . గ్రామంలో ప్రతి కులానికి ఒక దహన సంస్కార స్మశాన వాటిక స్థలాన్ని కేటాయించగా ఆరెకటికె కులస్తులకు స్మశాన వాటిక స్థలం కేటాయించకపోవడంతో దహన సంస్కారాలు చేయడానికి ఇబ్బంది ఎదుర్కొంటున్నామని అన్నారు . గత ప్రభుత్వ ప్రజా ప్రతినిదులు పలుమార్లు స్మశాన వాటిక స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ స్మశాన వాటిక స్థలం కేటాయించకపోవడం శోచనీయం. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకవెళ్లిన పట్టించుకోవడం లేదని సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాగా దిక్కుతోచక గ్రామ కుమ్మరి కుంట చెరువులో దహన సంస్కారాలు నిర్వహించే పరిస్థితి ఏర్పడుతుంది. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ స్పందించి వెంటనే ఆరెకటికి కులస్తులకు దహన సంస్కారానికి స్మశాన వాటిక స్థలం కేటాయించాలని వారు కోరుతున్నారు.

## సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్)ను కాపాడండి:

**- మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు**

**సూర్య వేములవాడ టౌన్**



52 సంవత్సరాల చరిత్ర గల సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్)ను వినియోగదారుల కోసం కాపాడి, ప్రభుత్వం బలోపేతం చేయాలని మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావుని కోరిన మాజీ శాసనసభ్యులు చెన్నమనేని రమేష్, సెస్సు చైర్మన్ చిక్కాల రామారావు, వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి సెస్సు 2,97,708 సభ్యులతో, 2,55,830 కనెక్షన్లతో, సభ్యుల వాటా ధనం 6,14,81,587 రూ.తో రాజన్న సిరిసిల్ల జిల్లాలో తన సేవలను వినియోగదారులకు అందిస్తున్నది. ఫిబ్రవరి మాసం లో సెస్సును మూసివేయాలని లేక ఎన్ డి పి సి ఎల్ లో విలీనం చేయాలన్న ప్రతిపాదనను ఇ ఆర్ సి ప్రభుత్వానికి నివేదించింది. ఈ నివేదిక హేతుబద్ధంగా లేదని, ఆర్థిక లావాదేవీలలో ప్రభుత్వ బకాయిలు సుమారు 500 కోట్ల వరకు ఉన్నందున సెస్సు అప్పులో ఉన్నదన్న వాదన సత్యదూరమని మంత్రిగారికి బృందం విన్నవించి వాటికి సంబంధించిన వివరాలు సమర్పించింది. సెస్సును బలోపేతం చేయడం కోసం సహకార శాఖ ఒక విమర్శణాత్మక విశ్లేషణ, భవిష్యత్తు కార్యక్రమం రూపకల్పన, ప్రభుత్వ సహకారం అంచనా తదితర అంశాల పైన వినియోగదారులు, ఉద్యోగులు, సహకార సంఘం నాయకులు, జిల్లా ప్రజా ప్రతినిధులతో సమాలోచనలు జరిపి, సెస్సును విజయవంతంగా ముందుకు తీసుకొని పోవడానికి పునరంకితం అయ్యే విధంగా సహకరించాలని కోరారు. మంత్రి గారు ఈ సమస్యల పైన సంబంధిత నివేదికలు మరియు వివిధ సంస్థలతో చర్చల ఆధారంగా వినియోగదారులకు తప్పక న్యాయం జరిగే విధంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

## ప్రభుత్వం పరిధిలో ఉన్న అన్ని రకాల కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలి

**సూర్య, సెంటినరీ కాలనీ**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అన్ని రకాల కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకులు (ఐ ఎఫ్ టి యు) ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాలను ప్రస్తుతం మార్కెట్ లో ఉన్న నిత్యావసర వస్తువుల ధరలను పరిగణలోకి తీసుకొని, గత 10 సంవత్సరాల నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేతనాలను పెంచకపోవడం వల్ల జరిగిన నష్టాన్ని పరిగణలోకి తీసుకొని శాస్త్రీయంగా కనీస వేతనాలను నిర్ణయించాలని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా విడుదల చేసిన ప్రీలిమినరీ నోటిఫికేషన్ లో పొందుపరిచిన వేతనాల ప్రతిపాదన సక్రమంగా లేదని,తక్షణమే దానిని ఉపసంహరించుకొని 73 షెడ్యూల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, కార్మికులు కనీస వేతనాలకు నోచుకోలేదని, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పెంచాల్సిన వేతనాలను పెంచడం లేదని, పెరిగిన వేతనాలు అనేక డిపార్ట్మెంట్ లో అమలు కావడం లేదని, కొన్ని ప్రభుత్వ రంగ డిపార్ట్మెంట్లలో జీ.వో.లు లేకుండానే గుండుగుత్తగా పనులు చేయించుకుంటున్నారని అన్నారు. ఇలాంటి తరుణంలో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పెంచి విడుదల చేయాల్సిన జీ.వో.లను రద్దు చేయడాన్ని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టి యు ) వ్యతిరేకిస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన జీవోలను పునరాలోచించి వేతనాలను పెంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# సీసీ రోడ్డు పరిచారు.. నీళ్లు మరిచారు

**- నిధులు నిరుపయోగమైతాయని గ్రామస్తుల ఆరోపణ.**

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని పోచమ్మ గుడి కి వెళ్లే దారిలో సిసి రోడ్డు పరిచి న గుత్తేదారు నీళ్లు పట్టడం మరిచారు. గుత్తేదారు



ఎన్ ఆర్ ఈ జీ ఎస్ పథకం లో మంజూరైన రూ 10 లక్షల సీసీ రోడ్డు నిర్మాణం పనులను గత ఐదు రోజుల క్రితం పూర్తి చేశారు. అయితే నిర్మాణం చేసిన మరుసటి రోజు నుండే సీసీ రోడ్డుపై నీళ్లు పట్టాలి కానీ గురువారం వరకు ఆ గుత్తేదారు సిసి రోడ్డుపై నీళ్లు పట్టకపోవడంతో సిసి రోడ్డు పగుళ్లు ఏర్పడుతుంటాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అసలే నాణ్యత లోపం ఆపై నీళ్లు పట్టకపోవడం, దంచుతున్న ఎండలకు రోడ్డు పగిలి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని, అదే కాకుండా నిధులు దుర్వినియోగం అయ్యే పరిస్థితి ఉందంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో గుత్తేదారు తన ఇష్టానుసారుగా రోడ్డు నిర్మాణం చేసి, నీళ్లు పట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన తర్వాత 25 రోజుల పాటు నీళ్లు కొట్టాల్సిన గుత్తేదారు



నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్మాణం చేసిన రోడ్డును పరిశీలించి, నీళ్లు పట్టే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికుల
# వేతనాలు తగ్గించే జీవోలు కాదు...పెంచే జీవోలను ఇవ్వండి

- జీవో నెం 94 ను రద్దు చేసి, 22ను గెజిట్ చేయాలి - స్టేట్ లేబర్ కమిషనర్ కి అభ్యంతరాలను తెలియజేసిన సిఐటియు

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలని, జీవో నెంబర్ 81, 94 రద్దు చేయాలని, 21, 22 జీవోలను గెజిట్ చేసి అమలు చేయాలని కోరుతూ కార్మికుల యొక్క వ్యక్తిగత దరఖాస్తులను వారి యొక్క ప్రతినిధులుగా తీసుకువచ్చి స్టేట్ లేబర్ కార్యాలయం (హైదరాబాద్) లో సిఐటియు యూనియన్ నాయకులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ గత సంవత్సరన్నర కాలం నుండి సింగరేణి కాంట్రాక్టు కార్మికులు జీవో నెంబర్ 21, 22 లను గెజిట్ చేసి, జీతాలను పెంచాలని ఆందోళన, పోరాటాలు చేస్తున్నారని, 2022లో 18 రోజుల సమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం జీవో నెంబర్ 22 కు అమలుకు ఆమోదించిందని, దానిని అమలు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. దీనిపైన ఇప్పటివరకు గత టిఆర్ఎస్ ప్రభుత్వం గాని, ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గాని దానికి సమాధానం చెప్పలేదని, పైగా కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెరుగుతాయి అని ఆశతో ఎదురు చూస్తున్న కాలంలో, కొత్తగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 21, 22 ను పక్కకు పెట్టి, జీవో నెంబర్ 81, 94 లను తీసుకువచ్చిందని అన్నారు. 94 జీవో కాంట్రాక్టు కార్మికులకు సంబంధించినది, జీవో 81 సెక్యూరిటీ గార్డ్లకు వర్తించే జీవోలు అని, ఇవాళ జీవో నెంబర్ 22 లో 21 వేల రూపాయలు జీతం ఉంటే, సగానికి సగం తగ్గించి రూ.11,325/- లకి రాష్ట్ర ప్రభుత్వం జీవోను తీసుకురావడం జరిగిందన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అని, ప్రభుత్వం ఇచ్చినటువంటి 21, 22, 23, 24, 25 జీవోలను 2017 లోనే డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చి, కనీస వేతనాల సలహా మండలి లో చర్చించి, ఫైనల్ గా 2021 జూన్ లో జీవోలు ఇచ్చారని అన్నారు. మళ్లీ ఆ జీవోలకి ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వడం అనేది చట్ట విరుద్ధమైన చర్య, రాజ్యాంగ వ్యతిరేకమైన చర్య అని, 21, 22 జీవోలను గెజిట్ చేసి అమలు చేయాలని 2023 సెప్టెంబర్ లో హైకోర్టు జడ్జిమెంట్ ఇచ్చిందన్నారు. దానిని అమలు చేయకపోతే కంటెంట్ ఆఫ్ కోర్టు కింద హైకోర్టులో కేసు నడుస్తోందని, ఒకపక్క హైకోర్టులో కేసు నడుస్తుండగానే, ఆ జీవోలను అన్నిటినీ పక్కనపెట్టి కొత్త జీవోలను ఇవ్వడం అనేది చాలా దుర్మార్గమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు అలాగే ఇంధన శాఖ మంత్రివర్యులు భట్టి విక్రమార్క లు సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల గురించి, వారి జీతాల గురించి ఆవేదన చెందుతున్నట్లు మాట్లాడుతూ, మరోపక్క సింగరేణి కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెరిగే 21, 22 జీవోలను పక్కకు పెట్టి,జీతాలు మొత్తం తగ్గించే కొత్త జీవోలను ఇవ్వడం అనేది వారి యొక్క ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా 94 జీవోని 81 జీవోలను రద్దుచేసి, 21, 22 జీవోలను గెజిట్ చేసి సింగరేణిలో ఉన్నటువంటి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికుల యొక్క ఎదురు దాడిని, ప్రతిఘటనని కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు గట్టు మహేందర్, అరవింద్, రాజన్న, వీరన్న, శ్రీను, రాజశేఖర్, రాజు, లక్ష్మి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# మానవాళి పాప పరిహారార్థమే ఏసుక్రీస్తు శిలువ మరణం

- నేడు గుడ్ ఫ్రైడే

**సూర్య, మంథని**

క్రైస్తవులందరూ గుడ్‌ఫ్రైడేను ఎంతో పవిత్రమైన రోజుగా పరిగణిస్తారు. ఏసుక్రీస్తుకు శిలువ వేసిన ఈరోజును గుర్తు చేసుకుంటూ గుడ్‌ఫ్రైడే వేడుకలను జరుపుకుంటారు. ఈ ఏడాది మార్చి 29వ తేదీ గుడ్‌ఫ్రైడే పండుగ వచ్చింది. క్రైస్తవులందరూ దేవుడిగా ఆరాధించే ఏసుక్రీస్తుకు శిలువ వేసిన రోజే గుడ్‌ఫ్రైడే. చరిత్రను పరిశీలిస్తే. అయితే తనకు శిలువ వేసిన రోజు శుక్రవారం కాబట్టి దీన్ని హోలీ ఫ్రైడే అని కూడా పిలుస్తారు. ఏసయ్య ప్రజలందరి రక్షణ కోసం తన జీవితాన్ని త్యాగం చేశాడని చాలా మంది నమ్ముతారు. ఏసుక్రీస్తు పునరుత్థానం లేదా ఆయన మళ్లీ తిరిగొచ్చారని నమ్ముతూ క్రైస్తవులు నిర్వహించే ఈస్టర్(ఆదివారం) పండుగ రెండు రోజుల ముందు గుడ్‌ఫ్రైడే వస్తుంది. వీటిని సంతాప దినాలు(లెంట్ డేస్)గా పరిగణిస్తారు. ఈ సమయంలో క్రైస్తవులు వేడుకలు, ప్రత్యేక విందుల వంటి వాటిని నిర్వహించరు. అయితే కఠినమైన ఉపవాస దీక్షలను పాటిస్తారు. మాంసాహారం తీసుకోరు. గుడ్‌ఫ్రైడే రోజున ఏసుక్రీస్తును స్మరించుకుంటూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ ప్రత్యేకమైన రోజున పాస్టర్లు సందేశాలిస్తారు. ఏసుక్రీస్తుకు శిలువ వేయడానికి గల కారణాలను గుర్తు చేసుకుంటారు. ఈ సమయంలో కేవలం 30 వెండి నాణేల కోసం జుడాస్ ఏసయ్యను ఎలా మోసం చేశాడు,తనను ఎంత క్రూరంగా హింసించారు,ఎందుకని ఏసు క్రీస్తుకు శిలువ వేశారు,శిలువకు ఎలా వేలాడదీశారనే పూర్తి కథలను వివరిస్తారు. అనంతరం ఆ దేవుడిని స్మరించుకుంటూ ప్రార్థనలు చేస్తారు. క్రైస్తవ మత విశ్వాసాల ప్రకారం, గుడ్‌ఫ్రైడే రోజును కొందరు వ్యక్తులు చాలా సంతోషకరంగా భావిస్తారు. ఎందుకంటే ఏసయ్య శిలువలో తన రక్తంతో ప్రజలందరి పాపాల నుంచి రక్షించాడని నమ్ముతారు. మరి కొందరు క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే రోజున తమ పూర్వీకుల సమాధి దగ్గరికి వెళ్లి కొవ్వొత్తులను వెలిగించి సంతాపం వ్యక్తం చేస్తారు. గుడ్‌ఫ్రైడే రోజున చాలా మంది క్రైస్తవులు ఏసుక్రీస్తు మరణానికి ప్రతీకగా శిలువలు, క్రీస్తు ఫోటోలు, విగ్రహాలపై నల్లని వస్త్రాలను కప్పుతారు. క్రైస్తవ మతస్తులు గుడ్‌ఫ్రైడేకు 40 రోజుల ముందు వారి ఇళ్లలోనే ప్రార్థనలు, ఉపవా సం వంటివి నిర్వహిస్తారు. ఈ సమయంలో కేవలం శాకాహారం మాత్రమే తీసుకుంటారు. గుడ్‌ఫ్రైడే రోజున చర్చిలకు వెళ్లి ఏసును స్మరించుకుంటూ ప్రార్థనలు నిర్వహిస్తారు. ఏసు క్రీస్తు సిలువలో పలికిన చివరి ఏడు మాటలను ధ్యానం చేస్తూ ప్రపంచంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మంథని నియోజకవర్గంలో చర్చిలలో పెద్ద ఎత్తున గుడ్ ఫ్రైడే ను నిర్వహించేందుకు, పాస్టర్లు సంఘ పెద్దలు, విశ్వాసులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు.



# ఇంటివద్దే ఓటు..వృద్ధులకు వెసులుబాటు..

**సూర్య, జగిత్యాల**

లోక సభ ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులకు, దివ్యఅంగులకు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కేంద్ర ఎన్నికల సంఘం అందు బాటులోకి తెచ్చిందని,అందుకు అర్హులేవరు ఎలా దరఖాస్తు చేసుకోవాలి ,ఆ విధానం పై ఆ వృద్ధుల,దివ్యంగుల సమాచారం కోసం తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసి యేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది హరి ఆశోక్ కుమార్ ఇలా వివరించారు..అర్హులు 85 ఏళ్ళు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా అంగ వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు వేసే వీలుంది. పోలింగ్ అధికారులు ఓటర్ ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించు కుంటారు .నిబంధనలకు అనుగుణంగా ఓ కంపార్ట్ మెంట్,ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ తెస్తారు. ఇంటి నుంచే ఓటేసే వెసులుబాటు ను ఉపయో గించుకునే వారు ఫారం 12డీ నింపి రిటర్నింగ్ అధికారికి గాని,సహాయ రిటర్నింగ్ అధికారికి గాని దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారు తమ పూర్తి చిరునామా, సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ పొందుపరుచాలి. దరఖాస్తు అందుకున్న తర్వాత సంబంధించిన దరఖాస్తుదారు ఇంటికి బూత్ స్థాయి అధికారులు వెల్లుతారు.అర్హతలను బట్టి ఇంటి నుంచే ఓటు సౌకర్యం కల్పించాలా వద్దా అనేది నిర్ణయిస్తారు. అర్హత ఉంటే దరఖాస్తుదారు ఇంటికే వెళ్ళి ఓటు వేయిస్తారు. రహస్య ఓటింగ్ లాగే అన్ని చర్యలు తీసుకుంటారని,ఎన్నికల కమిషన్ కల్పించిన ఈ సౌకర్యంను సద్వినియోగం చేసుకోవాలని 85 ఏళ్లు పైబడిన్న సీనియర్ సిటీజేన్లకు ,40 శాతానికి పైగా ఉన్న అంగవైకల్యం ఉన్న వారికి సమాచారం కోసం హరి ఆశోక్ కుమార్ ఇంటి నుంచే ఓటు సౌకర్యం వివరాలు తెలిపారు.

## ప్రమాదవశాత్తు నిప్పంటుకుని స్కూటీ దగ్ధం

**సూర్య, జగిత్యాల టౌన్**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణి నగర్ లో నాగమల్ల శ్రీనివాస్‌కు చెందిన ఏ పి 9027 నంబర్ గల ద్విచక్ర వాహనం గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధం అయ్యింది. శ్రీనివాస్ తన స్కూటీ రిపేర్ కోసం మెకానిక్ షాప్ కు తీసుకు వెళ్లి బయట నిలిపి ఉంచగా ఆకస్మికంగా బైక్ నుండి మంటలు చెలరేగాయి. ఆందోళనకు గురైన స్థానికులు సమీపంలో నీరు ప్రవహిస్తున్న డ్రైనేజీలో స్కూటీ ని నెట్టి వేయడంతో మంటలు చల్లారి పోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయ్యింది. అయితే ఎండ తీవ్రతతోనే బైక్ దగ్ధం అయి ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

## జిల్లా కలెక్టర్ గారిచే శిశుగృహ పాప దత్తత

**సూర్య, కరీంనగర్ ప్రతినిధి**

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో కరీంనగర్ శిశుగృహ లోని పాపను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారి టీ- CARA, అడాప్షన్ రెగ్యులేషన్స్-2022 ప్రకారం దత్తత ను హైదరాబాద్ చెందిన దంపతులకు గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఇవ్వడం జరిగింది. జనవరి నెలలో దత్తత ఇచ్చిన పాప యొక్క చెన్నై కి చెందిన దంపతులకు దత్తత ఉత్తర్వుల కాపీని గురువారం జిల్లా కలెక్టర్ చే అందజేయడమైనది.ఈ సందర్భంగా దత్తత తీసుకున్న దంపతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు భవిష్యత్తులో మంచి విద్య, పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, పి.ఓ(ఎన్.ఐ.సి) తిరుపతి, శిశుగృహ మేనేజర్ తేజస్వి, సిబ్బంది రాజేశ్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గణపతి సుబ్రహ్మణ్యేశ్వర సహిత నవగ్రహ ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ట...

**సూర్య, కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ పట్టణం తీగలగుట్టపల్లి లోని శ్రీ శివ భక్తాఆంజనేయస్వామి స్వయంభు దేవాలయంలో గణపతి సుబ్రహ్మణ్యేశ్వర సహిత నవగ్రహ గజస్తంభ శిఖర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొనిగత మూడు రోజులుగా దేవాలయంలో వేద పండితుల ప్రత్యేక పూజలు చేపట్టారు. వేదమంత్రో త్సవాల నడుమ ప్రతిష్ట కార్యక్రమం విజయవంతంగా ఘనంగా జరిగింది. ఇట్టి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో భాగంగా లక్ష్మీ గణపతి , నవగ్రహ సహిత హోమం నిర్వహించారు. 1వ డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో తీగల గుట్టపల్లి ప్రజలు , భక్తులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ లో ఓటరు అవగాహన ర్యాలీ

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ పట్టణంలోని 17వ వార్డులో మెప్మా ఆధ్వర్యంలో గురువారం ఓటరు అవగాహన, చైతన్య ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మెప్మా అధికారులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి 14 ఏప్రిల్ 2024 వరకు అవకాశం ఉందని అన్నారు. నూతనంగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలనుకునే యువత, యువకులు ఫామ్ 6 ద్వారా ఆన్ లైన్ లో నమోదు చేసుకోవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసీ కే. మానస, సిఎల్ఆర్పీ పి. స్వరూప, ఆర్పీ చాంద్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సాయిబాబా ప్రధాన ఆలయానికి 51,116 విరాళం

**సూర్య, చొప్పదండి**

చొప్పదండి పట్టణం లోని సాయిబాబా ప్రధాన ఆలయం నిర్మితమై ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన సిమెంట్ బ్రిక్స్ వ్యాపారి, బొడిగే మోహన్-వనిత దంపతులు 51,116 రూపాయలు విరాళం అందచేశారు.ఈ విరాళాన్ని ఆలయ ట్రస్టు చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డి కి అందజేశారు. ఈ సంధర్భంగా ఆలయ చేర్మేన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో బాగంగా ఎవరైన భక్తులు ట్రస్టు సభ్యులుగా చేరాలనుకుంటే ఆలయ ట్రస్టు కమిటీ కి తెలుపగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు ప్రధాన కార్యదర్శి డోలి రాజయ్య, కోశాధికారి దండె లింగన్న, జాయింట్ సెక్రటరీ దూస రాము, ఉపాధ్యక్షులు కటకం మహేష్, కార్యవర్గ సభ్యులు తాటిపెల్లి అంజయ్య, ట్రస్టు సభ్యులు వల్లాల నగేష్, గుర్రం ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

**సూర్య, ఎండపల్లి**

మండలం లోనికొండాపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల మురళి కుమారుని వివాహనీ కి గురువారం ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశి, పీసీసీ సభ్యుడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి , గాజుల విజయ్ ,సోమిశెట్టి రమేష్, గిల్లి శ్రీనివాస్ మన్నే జితేందర్ వెంకటస్వామి వడకపురం రవి, శ్రీనివాస్ పవన్ బుచ్చయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.